సంపుటి 1 - మార్చి 2016

# LEISA INDIA

# లీసా ఇండియా

తెలుగు ప్రత్యేక ప్రచురణ

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected translated articles into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం



# లీసా ఇండియా
## సంచిక 1, మార్చి 2016

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.


ఎ.యమ్.ఇ. ఫౌండేషన్
నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు - 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email : leisaindia@yahoo.co.in



| | |
|---|---|
| లీసా ఇండియా | ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు. |
| చీఫ్ ఎడిటర్ | కె.వి.యస్. ప్రసాద్ |
| మేనేజింగ్ ఎడిటర్ | టి.యమ్. రాధ |
| అనువాదం | రామ శేషు సూరంపూడి |
| అనువాద సమన్వయం | పూర్ణిమ |
| అడ్మినిస్ట్రేషన్ | రుక్మిణి జి. జి. |
| డిజైన్ లేఔట్ | శ్రీ సాయి క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్ |
| ముద్రణ | స్వాన్ ప్రింట్, బెంగళూరు |
| కవర్ ఫోటో | తన పెరటి తోటలో సాగుచేసిన పుచ్చకాయలను సగర్వంగా చూపిస్తున్న కమలవ్వ జాదవ్ - హలుకొప్ప గ్రామం, ధార్వాడ్ జిల్లా. |
| ఫోటో | ఎ.యమ్.ఇ.ఎఫ్ |


### లీసా మేగజైన్
**ఇతర ఎడిషన్లు**

లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్, బ్రెజిలియన్ మరియు చైనీస్ ఎడిషన్

### లీసా ఇండియా మేగజైన్
**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**

హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ


ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.



మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం


### లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్థ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

### ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.


ధర్మకర్తలు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్ |
| సభ్యులు | : | డా. విఠల్ రాజన్, డా. ఎం. మహదేవప్ప, డా. ఎన్. జి. హెగ్డే, శ్రీ టి.ఎం. త్యాగరాజన్, ప్రొ॥ వి. వీరభద్రయ్య, డా. ఎ. రాజన్న, డా. వెంకటేష్ తగత్, డా. స్మిత ప్రేమ్‌చందర్ |
| కోశాధికారి | : | శ్రీ బి.కె. శివరాం |
| ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ | : | శ్రీ కె.వి.ఎస్. ప్రసాద్ |


### మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్ధిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులకు,

మార్చి 2016 సంచికను మీ ముందుంచడం మాకు చాలా సంతోషాన్ని ఇస్తోంది. ఈ సంచికలో విత్తన సంరక్షణ, పోషకాహార భద్రత, అదనపు ఆదాయం చేకూర్చే వ్యవసాయాధారిత కార్యకలాపాల గురించి తెలుసుకుందాం.

విత్తన సంరక్షణ, సంప్రదాయక వరివంగడాల సాగు గురించి దక్షిణ భారతంలో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ఏటా నిర్వహించే విత్తన ఉత్సవాలు ఈ మార్పునకు వేదికగా నిలుస్తున్నాయి. వరిసాగులో వైవిధ్యాన్ని పెంపొందించటంతోపాటు ఈ ఉత్సవాల ప్రభావం కారణంగా రోజువారీ ఆహారంలో ఆరోగ్యవంతమైన ఎర్రన్నం స్థానం సంపాదించుకుంటోంది. వనరులు కొద్దిగా ఉన్న ప్రాంతాల పేద రైతన్నలు ఇప్పుడు కూరగాయల పెంపకం వైపు దృష్టి పెడుతున్నారు. అదనంగా ఆరోగ్య రక్షణకు అవసరమైన పోషక పదార్థాలను మాత్రమే కాకుండా అదనపు రాబడి సంపాదించు-కుంటున్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను పునర్వినియోగించే పద్ధతులు అనుసరిస్తున్నారు. ఈ విధంగా ధర్మపురి ప్రాంత మహిళలు ఏడాది పొడవునా కూరగాయల పెంపకం చేపట్టగలుగుతున్నారు.

ఈ సంచికలో నిత్యం కరవుకాటకాలలో కొట్టుమిట్టాడుతున్న ఒడిస్సారాష్ట్ర రైతన్నలు అనుసరిస్తున్న కొత్త పద్ధతులు చూడవచ్చు. అదనంగా తమ కుటుంబాలకు అవసరమైన ఆహారాన్ని సంపూర్ణ పోషకాలతో అందించ గలుగుతున్నారు. వాతావరణ మార్పులను తట్టు కోగలుగుతున్నారు. కాయగూరల తోటల పెంపకం, చేపల పెంపకం ద్వారా అవసరమైన పోషకాలతో ఆహారాన్ని, తగుమాత్రం ఆదాయాన్ని కూడా సంపాదించుకోగలుగుతున్నారు.

మీ అభిప్రాయాలు మన అందరికీ ఎంతో అమూల్యమైనవి. వాటి కోసం మేం కూడా ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నాము. మీ తోటి రైతన్నలు ఎవరైనా ఈ మ్యాగజైన్ చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని మీరు ఆశిస్తుంటే వారి పూర్తి చిరునామా మాకు తెలియజేయండి. సంతోషంగా మేము వారికి కూడా ఈ మ్యాగజైన్ అందజేస్తాము.

నూతన సంవత్సరం మీకు ఆనందదాయకంగా సాగాలని ఆశిస్తూ..

సంపాదకులు




**పోషకాల ఉద్యానాలు ........................................................ జె. కృష్ణన్** **4**

తమిళనాడు రాష్ట్రంలోని వర్షాధారిత ప్రాంతమైన ధర్మపురి పరిసరాల్లో మహిళలు పెరటి తోటల పెంపకం వైపు తమ దృష్టిని, కృషిని మళ్లిస్తున్నారు. వారి చొరవ కారణంగా వారి కుటుంబాలకు ఇప్పుడు పోషక విలువలు సమృద్ధిగా ఉన్న ఆహారం లభిస్తోంది. మరింతగా ఆదాయం లభిస్తోంది.



**పేదరికం నుంచి ఆశల అంచులకు ............................................. ప్రదాన్** **7**

సుకృత్ బాయ్ నిరుపేద మహిళ. మరెందరో మహిళల్లాగే ఒంటరి జీవితం సాగిస్తున్నది. భర్త నిరాదరణకు, అన్ని విధాలా అణచివేతలకు గురైన పేదరికం లోనే మగ్గిపోయిన సగటు స్త్రీ. పీరా గ్రామంలో నివసిస్తున్న సుకృత్ ఇప్పుడు ఆత్మవిశ్వాసం నిండుగా రూపుదాల్చిన స్త్రీ. ఆమె దృష్టి ఇప్పుడు పూర్తిగా పౌల్ట్రీ సంస్థ నిర్వహణపైనే కేంద్రీకృతమై ఉంటున్నది.....



**విత్తన ఉత్సవాలు - విత్తన భద్రతకు ఊతం........................ శ్రీదేవి లక్ష్మీ కుట్టి** **10**

తరతరాలుగా వస్తున్న విత్తన సంపత్తిని సురక్షితంగా కాపాడుకోవాలనే ఆలోచన దక్షిణ భారత దేశంలో చాలా బలంగా వ్యాపిస్తోంది. రైతుల్లో సంప్రదాయక వరి వంగడాలను కాపాడుకోవాలనే కోరిక బలపడుతోంది. ఇందుకు ఏడాదికి ఒకసారి నిర్వహించే ఉత్సవాలు వేదికలుగా మారుతున్నాయి.....



**హరిత శక్తా - జీవనోపాధులా ?! .................. ఫరూక్ రియాజ్, అనిత సూద్....** **14**

బంజరుగా మారిన కల్పవల్లి అటవీ భూమి స్థానిక ప్రజల ప్రయత్నంతో పునరుద్ధరింపబడి తిరిగి జీవం నింపుకుంది. కానీ హరిత శక్తి పేరుతో మళ్ళీ ఆ భూమి పతనావస్థకు చేరుకుంది. గాలి మరలు 'క్లీన్ ఎనర్జీ'ని ఉత్పన్నం చేస్తాయన్న దాన్లో సందేహం లేదు. కానీ దాని మూల్యం ఎంత? ఈ గాలిమరల ఏర్పాటు ఉదంతం మనకు ఇంకో కొత్త కోణం చూపిస్తోంది.



**అమూల్యమైన చిన్న కమతాలు ............. రంజన్ కె. పాండా, అజిత్ కుమార్ పాండా** **17**

ఒడిశాలో జలప్రళయంలో సర్వం కోల్పోయిన చిన్న రైతులు తమ కుటుంబాలకు ఆహారభద్రతను, పోషకాహారాన్ని సమకూర్చేందుకు సరికొత్త మార్గాన్ని కనుగొన్నారు. ఆ ప్రయత్నంలో వాతావరణంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా తట్టుకునే ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించారు....

# పోషకాల ఉద్యానాలు

## మహిళలే సూత్రధారులు

**జె. కృష్ణన్**

**తమిళనాడు రాష్ట్రంలోని వర్షాధారిత ప్రాంతమైన ధర్మపురి పరిసరాల్లో మహిళలు పెరటి తోటల పెంపకం వైపు తమ దృష్టిని, కృషిని మళ్లిస్తున్నారు. వారి చొరవ కారణంగా వారి కుటుంబాలకు ఇప్పుడు పోషక విలువలు సమృద్ధిగా ఉన్న ఆహారం లభిస్తోంది. మరింతగా ఆదాయం లభిస్తోంది. అందుబాటులో ఉన్న పరిమిత నీటి వనరులను సక్రమంగా వినియోగించడంతో పాటు పునర్వాడకంలో చూపిస్తున్న నేర్పు ఏడాది పొడవునా కాయగూరలను పండించడం సాధ్యం చేస్తోంది.**

తమిళనాడులోని ధర్మపురి జిల్లా, పెన్నగరం తూర్పు కనుమలకు పడమటి దిశగా ఉండి భౌగోళికంగా ఒక ప్రత్యేకతతో విశిష్ట లక్షణాలను కలిగి ఉంటుంది. కొండ ప్రాంతం కావడంతో కావేరీ ప్రవాహం నుంచి అంతగా ప్రయోజనాలు ఈ జిల్లావాసులకు లభించవు. నిత్యం నీటి కొరత ఇక్కడ పెద్ద సమస్యగా సాగు రంగాన్ని మాత్రమే కాకుండా తాగునీటికి కూడా కటకట పడవలసి వస్తూ ఉంటుంది.

వర్షపు నీటిపై ఆధారపడి వేరు శెనగ సాగు ఇక్కడ ఎక్కువగా జరుగుతూ ఉంటుంది. వ్యవసాయదారులు అంతర పంటలుగా కందులు, కౌ పీ (Cow Pea) సాగు చేస్తారు. ఈ పంటలు ఇక్కడి పేద ప్రజానీకానికి ఆదాయం చేకూర్చడమే కాక, వారి కుటుంబాలకు అత్యవసరమైన పోషకాహారం, పశువులకు మేత అందించడానికి కూడా తోడ్పడుతున్నాయి. అయితే గడచిన రెండు దశాబ్దాలుగా రైతన్నలకు అనేక రకాల సమస్యలు, సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిలో ముఖ్యమైనవి - తరచుగా పంట దిగుబడి దెబ్బతినడం, అంతులేకుండా సాగు ఖర్చుల భారం పెరిగిపోతూ ఉండడం, దిగుబడి ఆశించిన దానికన్నా చాలా తక్కువగా ఉండడం, చివరికి చేతికి అతి స్వల్ప మొత్తాలలోనే ఆదాయం లభించడంతో రైతన్నలు చాలా నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతున్నారు. రసాయనిక ఎరువుల వినియోగం అపరిమితంగా ఉండడంతో భూసారం క్షీణించి నిస్పృహల్లో కూరుకుపోతున్నారు. రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం క్షీణించిపోతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. ఒక ఏడాది వర్షాల రాక అస్తవ్యస్తమైనట్లయితే, ఇక్కడి రైతులు జొన్న సాగు (Finger Millet) చేపడుతున్నారు.



*వంటింట్లో ఒకసారి ఉపయోగించిన వ్యర్థ జలాలను శుద్ధిచేసి కాయగూరల పెంపకానికి అనువుగా మార్చే ప్రక్రియలో పాల్గొంటున్న మహిళలు*

సాధారణంగా ఇలాంటి వర్షాధారిత ప్రాంతాలలో సాగుచేయడానికి ఇదే అన్ని విధాలా అనువైన పంట. అలాంటి క్షామపీడిత సంవత్సరాలలో రైతు కుటుంబాలకు, పశువులకు కూడా పోషక విలువలతో కూడిన ఆహారం ఏమాత్రం లభించదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో రైతు కుటుంబాలను ఆదుకునేందుకు ఎవిఎంఈ ఫౌండేషన్ పెరటి తోటల పెంపకం ప్రోత్సహించింది. ఆ రకంగా వారికి పోషక విలువలున్న ఆహారం సమకూరడానికి తన వంతు తోడ్పాటును అందిస్తోంది. ఎవిఎంఈ ఫౌండేషన్ ప్రోత్సాహం కారణంగా పెన్నగరం తాలూకాలోని 20 గ్రామాలలో పెరటి తోటల సాగును విస్తారంగా ఆయా గ్రామాల రైతు కుటుంబాలు చేపట్టాయి. ఈ కార్యక్రమాన్ని ధర్మపురి ఫార్మ్ ఇనీషియేటివ్ (DFI)లో భాగంగా చెన్నైకి చెందిన శ్రీవత్స రామ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నారు.

### తొలి అడుగులు

వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ముందుగా రైతులను సమావేశపరచి వారి అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం (PRA) పార్టిసిపేటరీ రూరల్ అప్ప్రైజల్ జరిగింది. అందులో రైతులతోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి నుంచి ప్రస్తుత పరిస్థితుల గురించి మాత్రమే కాక భవిష్యత్తు కోసం చేపట్టవలసిన చర్యల గురించి విస్తృతంగా చర్చించడం జరిగింది. వేరు శెనగ సాగును అభివృద్ధి చేయడం మొట్టమొదట చేపట్టవలసిన

కార్యక్రమంగా గుర్తించారు. తరువాత పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించవలసిన అవసరాన్ని గుర్తించారు.

ప్రారంభంలో 20 గ్రామాల నుంచి ఎంపిక చేసిన 25 మంది ఔత్సాహికులైన యువతులకు పర్యావరణ అనుకూల పద్ధతుల్లో వేరు శెనగ సాగు గురించి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో భాగంగా, వారు ఇతరులకు ఈ విషయంలో సహకరించేందుకు వీలుగా అవసరమైన నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రత్యేకంగా రైతులకు క్షేత్ర స్థాయి శిక్షణ కేంద్రాలను (Farmer Field School) ఏర్పాటు చేసారు. ఇలా సుశిక్షితులైన మహిళలు, ఏఎంఈ సిబ్బంది, ఆ 20 గ్రామాలకు చెందిన రైతు శిక్షణ కేంద్రాల నిర్వహణలో పాల్గొన్నారు. మొత్తం మీద 400 మంది రైతులు ఇలా శిక్షణ పొందారు. సుస్థిరమైన సాగు పద్ధతులలో వేరు శెనగ సాగులో వారు నైపుణ్యం పెంపొందించుకోగలిగారు.

## పెరటి తోటల ఏర్పాటు

వేరు శెనగ సాగులో సంతృప్తికరమైన ఫలితాలు సంపాదించుకున్న ఆ మహిళలంతా తమ కుటుంబానికి ఉపయోగకరమైన ఇతర అంశాలపై కూడా శ్రద్ధ చూపించారు. ఈ సమయంలోనే పెరటి తోటల ఆలోచన రూపుదిద్దుకుంది. ఆ విధంగా తమ కుటుంబంలోని ప్రతీ ఒక్కరికీ పోషక విలువలతో కూడిన ఆహారం సమకూర్చడం సాధ్యమవుతుందని గుర్తించి అందుకు ముందుకు వచ్చారు. మెళకువలు నేర్చుకునేందుకు వారు ఉత్సాహం చూపించారు. ప్రత్యేకంగా సేద్యపు పనులు లేని సమయాలలో ఇలాంటి కొత్త విషయాలు నేర్చుకునేందుకు వారు సుముఖత చూపారు. ఆ కారణంగా తక్కువ ఖర్చుతో పర్యావరణ అనుకూల పద్ధతుల్లో పెరటి తోటల పెంపకం గురించి శిక్షణ పొందారు.

ఆరంభంలో వాళ్లు 13 రకాల కాయగూరల సాగును చేపట్టారు. (టేబుల్ 1 చూడగలరు) కాయగూరలు సమృద్ధిగా పండాయి. ఆకు కూరలు పుష్కలంగా పండాయి. మొదట్లో వాటిని తమ కుటుంబ అవసరాలకు వినియోగించేవారు. క్రమంగా మిగులుగా ఉన్న వాటిని ఇరుగుపొరుగు వారికి ఇవ్వడంతో పాటు మార్కెట్లో అమ్మడం వారికి సాధ్యమైంది. రోజువారీ దిగుబడులు రావడంతో వారి ఇంటి అవసరాలకోసం మార్కెట్‌కు వెళ్లి కూరలు కొనడం పూర్తిగా మానివేశారు. ఆ రకంగా ఒక్కో కుటుంబం నెలకు దాదాపు రూ.2100 వరకు ఆదా చేసుకోగలిగారు. ఒక నెల వ్యవధిలో వారు తమ తోటలో 6-9 కిలోల వంకాయలు (Brinjal), 7-9 కిలోలు బీరకాయలు (Ribbed Gourd), 10-14 కిలోల బెండకాయలు, 4-6 కిలోల కాకరకాయలు వాళ్ల పెరటి తోటలలో పండించారు. ఇందులో దాదాపు 40 శాతం అమ్మివేయడం ద్వారా నెల తిరిగే సరికి వారు రూ.2000 - 2400 వరకూ అదనంగా ఆదాయం సంపాదించే స్థాయికి చేరుకున్నారు. ఈ కార్యక్రమం కింద దాదాపు 400 మంది రైతులు తమ ఇంటి వెనకాల ఉన్న 100 నుంచి 150 చదరపు అడుగుల స్థలంలో కాయగూరలను పండించడం ప్రారంభించారు.

కాయగూరల పెంపకంలో వచ్చే లాభాలు వారికి ఉత్సాహం కలిగించినా నీటి కొరత కారణంగా దీన్ని కొనసాగించడం లేదా విస్తరించడం పెద్ద సమస్యగా మారింది. అందువల్ల కాయగూరల పెంపకం కూడా వర్షాలపై ఆధారపడవలసిన పరిస్థితి ఎదురైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు వారు వ్యర్థంగా నేలపాలవుతున్న నీటిని అంటే ఒకసారి ఇంట్లో ఉపయోగించిన తరువాత వృధాగా మురికి కాలువల పాలుచేస్తున్న నీటిని కూడా ఉపయోగించుకోవాలనే ఆలోచనకు పురికొల్పింది. ముందుగా వంటింట్లో వాడుతున్న నీటిలో ఎంత మేరకు వృధాగా పోతున్నదో వారు ఒక అంచనా వేశారు. వారి అంచనా ప్రకారం రోజూ ఇలా 40 నుంచి 50 లీటర్ల నీరు వ్యర్థమవుతోందని గుర్తించారు. ఇలా నీటిని పారబోసుకోవడం కన్నా, దానిని పెరటి తోటకు మళ్లిస్తే మంచిదని నిర్ణయించుకున్నారు. కొద్దిగా అయినా అందుబాటులో ఉన్న నీటి వనరును వృధా కాకుండా నీటిని శుద్ధిచేసి (ఫిల్టర్) డ్రమ్ముల్లో (50 లీటర్ల నిల్వ సామర్ధ్యంతో) నిల్వచేసి వాడడం ప్రారంభించారు. ఆ డ్రమ్ములకు బిందు సేద్యానికి అనువుగా డ్రిప్ లెట్స్ అమర్చుకున్నారు. వాటి సాయంతో మొక్కల పాదులు తడపడం మొదలెట్టారు. ఈ విధంగా తోటల పెంపకంలో వారు వినూత్న ఆలోచన కూడా చేశారు. లీటరు మంచి నీటి సీసాలు ఉపయోగించే పద్ధతి పాటించారు. పాదులకు నీరు పెట్టేందుకు వారీ సీసాలను ఆధారం చేసుకుని డ్రిప్ సాగు చేపట్టారు. ఈ విధంగా నీటి వనరులను మెరుగ్గా ఉపయోగించడానికి వారు చొరవ తీసుకున్నారు. వృధాగా నీరు ఎండిపోకుండా, మట్టిలో కలిసిపోకుండా తోటలో మొక్కల పెంపకం వైపు మళ్లించి మెరుగైన ఫలితాలు సాధించారు. ఇప్పుడు అన్ని కుటుంబాలు ఈ పద్ధతిలో వంటింటి నీరు వృధా కాకుండా సద్వినియోగం చేసుకుంటున్నాయి.

ఈ విధంగా పెరటి తోటల పెంపకంలో మహిళలతో పాటు ఇంటిల్లిపాది చురుగ్గా పాల్గొనడం చెప్పుకోవలసిన విషయం. తోటకు కావలసిన నీటిని ఇంటికి మోసుకురావడం, కంచె నిర్మాణం వంటి వాటిని మగవాళ్లు చేసేవారు. మహిళలు మొక్కలకు పాదులు పెట్టి నీరు అందించడం, క్రిమికీటకాలనుంచి కాపాడేందుకు జిగురుతో ఉన్న పాలస్టర్లను వాటికి అతికించడం ఇంకా ఇతర పనులు చేస్తున్నారు. ఇక చిన్న పిల్లలు తమ వంతు సాయంగా తల్లికి చేయూత అందిస్తున్నారు. అది కూడా వారికి చదువుల ఒత్తిడి లేని సమయాల్లో మాత్రమే.

ఇప్పుడు వారి ఆహారపు అలవాట్లలో కూడా మార్పు వచ్చింది.

టేబుల్ 1 . పెరటి తోటల నెలసరి దిగుబడి వివరాలు

| కాయగూరలు | దిగుబడి (కిలోల్లో) | కుటుంబ అవసరాలకు.. (కిలోల్లో) | ఇరుగుపొరుగు లకు.. (కిలోల్లో) | అమ్మివేసిన మొత్తం.. (కిలోల్లో) | అమ్మకాల వల్ల ఆదాయం (రూ.లలో) | కొనే అవసరం లేకపోవడంతో మిగిలిన సొమ్ము (రూ.లలో) |
|---|---|---|---|---|---|---|
| ముల్లంగి | 15-25 | 5-6 | 1-2 | 10-15 | 150 | 200 |
| బీట్రూట్ | 10-15 | 5-8 | 1-2 | 5-8 | 200 | 200 |
| పొట్లకాయ | 10-15 | 3-5 | 1-2 | 4-5 | 100 | 200 |
| బీరకాయ | 8-10 | 10 | 1-2 | 5 | 200 | 200 |
| కాకరకాయ | 5-8 | 2-3 | 1 | 2-3 | 100 | 200 |
| టొమాటో | 25-30 | 10 | 1-2 | 10-15 | 400 | 200 |
| బెండకాయ | 15-25 | 5-6 | 1-2 | 10-15 | 200 | 200 |
| వంకాయ | 10-15 | 3-5 | 1-2 | 8-10 | 300 | 200 |
| ఆకుకూరలు (4 రకాలు) | 20-30 | 10 | 1-2 | 8-15 | 250 | 200 |
| గుమ్మడికాయ | 60-70 | 30 | 0.5 | 50 | 300 | 200 |
| క్యారట్ | 5-10 | 5 | 1 | 5 | 200 | 200 |
| మొత్తం | | | | | 2400 | 2100 |

వారు రోజూ తీసుకునే ఆహారంలో రకరకాల కాయగూరలకు ఒక ప్రత్యేక స్థానం దక్కుతోంది. ఫలితంగా వారి ఆరోగ్యం కూడా బాగా మెరుగయింది. ఆకు కూరలు అధికంగా ఆహారంలో భాగంగా చేర్చుకుంటున్న కారణంగా తమకు జీర్ణ సంబంధమైన సమస్యల బెడద తగ్గిపోయిందని వారు అంటున్నారు.

పెరటి తోట పెంపకం పనులను ఇతరత్రా సేద్యపు పనుల ఒత్తిడి లేని సమయాలలో మాత్రమే చేపడుతున్నారు. అంటే మొదటి రెండు సంవత్సరాల కాలంలో జనవరి - జూన్ మాసాల (2010-11, 2011-12) మధ్య చేపట్టేవారు. ఇప్పుడు ఆ నెలల్లో కూడా పెరటి తోటల సాగుపై మహిళలు తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ఆ రకంగా ఏడాది పొడవునా కాయగూరలకు కొరత లేకుండా చూసుకుంటున్నారు.

## విస్తరిస్తున్న విజయపథం

ఈ ప్రాంతంలోని 400 మంది మహిళలు సాధించిన అపూర్వ విజయాలు ఇతర ప్రాంతాలకు కూడా స్ఫూర్తివంతంగా మారాయి. ఆ 20 గ్రామాలలో మరో 300-500 కుటుంబాలు ఇప్పుడు పెరటి తోటల పెంపకం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి.

కుటుంబ సేద్యంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ప్రారంభ వేదికపై నిలిచి తమ విజయగాథ వినిపించే మహదవకాశం ఈ మహిళలకు దక్కింది. ఈ సదస్సు బెంగళూరులో జరిగింది. ఇంటి తోటల్లో పెంచిన వివిధ రకాల కాయగూరలను వారు ఈ సందర్భంగా ప్రదర్శించారు. తమ అనుభవాలను ఘనంగా అందరికీ వినిపించారు. ఈ మహిళల జీవితాలలో పెరటి తోటలు అనూహ్యమైన మార్పులకు రాచబాటలు వేసాయి. దీని వల్ల వారి కుటుంబాలకు ఇప్పుడు పోషక విలువలు సమృద్ధిగా ఉన్న ఆహారం లభిస్తోంది. అదనంగా ఆదాయం సంపాదించ గలుగుతున్నారు. కాయగూరల కోసం 10-15 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లవలసిన దుస్థితి వారికి తప్పింది. అన్నిటికన్నా ముఖ్యంగా వారి కుటుంబ సభ్యుల మధ్య, ఇరుగుపొరుగుతో వారికి సంబంధాలు మరింత బలపడ్డాయి. ◆

**J KRISHNAN**
FAO trained FFS facilitator
AME Foundation, No. 5/1299-B-2,
NSCB Road, Behind TAMS Colony,
Lakkiampatty, Dharmapuri - 636705
Email : josephkrish@rediffmail.com

ఆంగ్లమూలం :

లీసా ఇండియా, సంపుటి 16, సంచిక 4, డిశంబర్ 2014.

# పేదరికం నుంచి ఆశల అంచులకు

## మహిళల పౌల్ట్రీ నిర్వహణ విజయ గాథ


## ప్రదాన్


**సుకృత్ బాయ్ నిరుపేద మహిళ. మరెందరో మహిళల్లాగే ఒంటరి జీవితం సాగిస్తున్నది. భర్త నిరాదరణకు, అన్ని విధాలా అణచివేతలకు గురైన పేదరికం లోనే మగ్గిపోయిన సగటు స్త్రీ. పీరా గ్రామంలో నివసిస్తున్న సుకృత్ ఇప్పుడు ఆత్మవిశ్వాసం నిండుగా రూపుదాల్చిన స్త్రీ. ఆమె దృష్టి ఇప్పుడు పూర్తిగా పౌల్ట్రీ సంస్థ నిర్వహణపైనే కేంద్రీకృతమై ఉంటున్నది. ధ్రుఢ సంకల్పం, బయటి నుంచి అందిన కొద్దిపాటి చేయూత మాత్రమే ఆమె పెట్టుబడి. ఆమె జీవితమే మారిపోయింది. మెరుగుపడిన శక్తిసామర్థ్యాలు, ఆత్మవిశ్వాసంతో సమర్థవంతంగా పౌల్ట్రీ నిర్వహిస్తున్న సుకృత్ ఇప్పుడు ఆమె గ్రామంలోని ఇతర మహిళలందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.**

మధ్యప్రదేశ్‌లోని ఛత్తర్‌పూర్ గ్రామ వాసి సుకృత్ బాయ్. ఆమెకు 12 ఏండ్ల కుమారుడు ఉన్నాడు. ఆమె తన తల్లిదండ్రులు, నలుగురు సోదరులతో కలిసి నివసిస్తున్నది. 12 ఏండ్ల క్రితం ఆమెను భర్త వదిలేసాడు. ఆ కారణంగానే ఆమె తన పుట్టింటికి వచ్చి అక్కడే బతుకుతోంది. వారికి సుమారుగా 8 ఎకరాల పొలం ఉన్నది. ఆ చిన్న భూమినే నమ్ముకుని ఆ కుటుంబం గోధుమ, పప్పు ధాన్యాలు, ఆవాలు, మినుములు, పెసలు, సోయాబీన్ పండించుకుని జీవనం సాగిస్తున్నది. వారు చేపట్టే సేద్య భారం మొత్తం కుటుంబ పోషణ లక్ష్యంతోనే సాగుతుంది. వారికి అదే జీవనాధారం. అలా పండించిన పంటలో చాలా కొద్ది భాగం మాత్రమే మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉంటుంది. ఆమె సోదరులు వ్యవసాయ కూలీలుగానో, భవన నిర్మాణ కార్మికులుగానో పరిసర గ్రామాలకు వెడుతూ ఉంటారు. గతి లేని పరిస్థితిలో పుట్టినింటికి చేరిన సుకృత్ ఏనాడూ తన తల్లిదండ్రులకు భారంగా ఉండాలనుకోలేదు. కొత్తలో వెదురు బుట్టలు అల్లి, వాటిని విక్రయించి తన అవసరాలకు సరిపడా సంపాదించి ఇచ్చేది. రు.30 - రు.40 ఖర్చుపెట్టి వెదురు కొని తెచ్చుకునేది. వాటితో తయారు చేసిన బుట్టలను రు.100కే విక్రయించేది. అలా ఆమె రోజుకు ఒక్క బుట్ట మాత్రమే అల్లడం సాధ్యమయ్యేది. ‘‘ఇలా బుట్టలను అమ్మడం వల్ల వచ్చే కొద్ది ఆదాయం నా అవసరాలకే చాలేది కాదు. అలాంటి సమయంలో నాకు అండగా ఉంటున్న అమ్మా, నాన్నలకు ఏమి ఇవ్వగలను? వారికి ఏ విధంగానూ సాయం చేయలేకపోయేదాన్ని అన్నారు సుకృత్.



*పౌల్ట్రీ ఏర్పాటు చేసుకున్న తరువాత సుకృత్ బాయ్ అటు ఆదాయాన్ని, ఇటు ఇరుగుపొరుగు నుంచి గౌరవాభిమానాలను కూడా పొందగలుగుతోంది.*

ఆ సమయంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆశా రేఖ కనిపించింది. రాష్ట్ర జిల్లా స్థాయి పేదరికం నిర్మూలన ప్రాజెక్టు (MP-DPIP ) చేపట్టిన ‘ప్రదాన్’ నిర్వాహకులు వారి గ్రామానికి వచ్చారు. మహిళలను చేరదీసి వారి జీవనోపాధులను మెరుగుపరిచేందుకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. ఇది 2005లో జరిగింది. ముందుకు వచ్చే మహిళలకు ప్రభుత్వం నుంచి అందే సహాయసహకారాలను వారు తెలియజేశారు. చాలామంది ఆసక్తి చూపించారు. వారిలో సుకృత్ కూడా ఒకరు. ప్రదాన్ ప్రోత్సాహంతో వాళ్లంతా పౌల్ట్రీ పరిశ్రమవైపు దృష్టిపెట్టారు. కోళ్ల పెంపకంలో మెళకువలు తెలుసుకున్నారు. వారిని సమష్టి ప్రయోజనాల బృందాలుగా సంఘటితం చేసింది ప్రదాన్. అలాంటి ఒక బృందంలో సుకృత్ సభ్యురాలిగా 2006లో అడుగుపెట్టింది.

ఈ విధమైన సమష్టి ప్రయోజనాల బృందాల ఏర్పాటు కారణంగా, సమీప గ్రామాలకు చెందిన మరో నలుగురు మహిళలతో కలిసి రెండు రోజుల శిక్షణ కోసం హోషంగాబాద్ జిల్లాలోని ఖేస్లాకు బయలుదేరి వెళ్లింది. అక్కడ వాళ్లంతా కోళ్ల పెంపకంలో శిక్షణ తీసుకున్నారు. ఆ కార్యక్రమాన్ని ఖేస్లా పౌల్ట్రీ సొసైటీ నిర్వహించింది. పౌల్ట్రీ (బ్రాయిలర్) నిర్వహణ మెళకువలు, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణం వంటివి నేర్చుకున్నారు.

శిక్షణ ముగిసిన తరువాత, వాళ్లంతా మధ్యప్రదేశ్ జిల్లా స్థాయి పేదరికం నిర్మూలన ప్రాజెక్టుతో అనుసంధానమయ్యారు. అక్కడ వారికి ఒక్కొక్కరికి రూ.30000 చొప్పున ఆర్థిక సాయం

లభించింది. ఆ మొత్తంతో 300 చదరపు అడుగుల కోళ్ల ఫారమ్ షెడ్డును నిర్మించుకున్నారు. ఆ తరువాత కొంతకాలానికి చుట్టుపక్కల ఉన్న 13 గ్రామాలకు చెందిన 360 మంది మహిళలు సంఘటితమై సహకార రంగంలో సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. దాని పేరు రాజ్‌నగర్ గ్రామీణ మహిళా ముర్గి ఉత్పాదక్ సహకారిత మర్యాదిత్. ఇప్పుడు ఆ సొసైటీ బోర్డులో సుకృత్ బాయ్ ఒకరు. ఇలా సొసైటీగా ఏర్పడిన తరువాత పౌల్ట్రీ పెంపకం కార్యక్రమం చేపట్టారు. ఒకరోజు వయసున్న కోడి పిల్లల పెంపకం బాధ్యత చేపట్టారు. ఒకొక్కరు 300 కోడి పిల్లలను తెచ్చుకున్నారు.

వారి నుంచి మళ్లీ కోడి పిల్లలను సొసైటీ కొనుగోలు చేస్తుంది. వాటికి అవసరమైన మేత అందిస్తుంది. అవసరమైన మందులు, వ్యాక్సీన్లు సరఫరా చేస్తుంది. అందుకయ్యే ఖర్చును వారి నుంచి కొనుగోలు చేసిన కోడి పిల్లల ఖరీదు నుంచి వెనక్కి తీసుకుంటారు. 25 నుంచి 28 రోజులపాటు పెంచిన కోళ్ల బరువు కిలో నుంచి 1.2 కిలోల వరకు పెరిగిన తరువాత వాటిని సొసైటీ మరింత అధిక ధరను చెల్లించే కొనుగోలుదారుకు విక్రయిస్తుంది. అవసరమైన వైద్య సాయం అందించేందుకు ఒక వైద్యుడిని కూడా సొసైటీ సమకూరుస్తుంది. వారికి అవసరమైన సాంకేతిక సలహా సూచనలు అందించేందుకు తోడ్పడుతుంది.

మొదటిసారి కోడి పిల్లల పెంపకానికి తీసుకెళ్లిన సమయంలో వారికి తగిన సూచనలు ఇవ్వడానికి కేరళ నుంచి ప్రత్యేకంగా శిక్షకుడిని ఛేస్లాకు తీసుకువచ్చారు. అతని ఆధ్వర్యంలో 30 రోజులపాటు క్షేత్రస్థాయిలోనే వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇప్పించారు. అతడు నిత్యం వాళ్ల కోళ్ల ఫారమ్‌లను స్వయంగా సందర్శించి వాటిని పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయసహకారాలు అందజేసే సదుపాయం కూడా సొసైటీ సమకూర్చింది. కోళ్ల పెంపకంలో ఉత్తమ విధానాల గురించి వాళ్లకి తెలియజేయాలంటే వారికి సమీప గ్రామంలోనే ఒక చోట అందరినీ సమావేశపరచి వివరించేవాడు.

వచ్చిన ఫలితాలు మాకు సంతృప్తి కలిగించింది. మరింత డబ్బు మదుపు చేయడానికి ధీమా వచ్చింది. మా కార్యకలాపాలను విస్తరించుకోవాలనే ఆలోచన వచ్చింది, అని ఇప్పుడు సుకృత్ బాయ్ ధైర్యంగా చెప్పగలుగుతున్నారు. కోళ్ల పెంపకం చేపట్టిన మహిళలు తమ గ్రామంలోనే వారానికి ఓసారి సమావేశమయ్యేవారు. తమకు ఎదురైన సమస్యల గురించి

> కోడి పిల్లల సేకరణ, బ్రాయిలర్ పక్షుల విక్రయం వంటి బాధ్యతలను సమష్టిగానే నిర్వహిస్తారు. ఫలితంగా మన దృష్టిని పూర్తిగా కోడి పిల్లల పెంపకంపైనే కేంద్రీకరించవచ్చు.

కలిసి కూర్చుని చర్చించుకునేవారు. పరిష్కారాలు గుర్తించేవారు. అదే విధంగా సొసైటీ పాలకవర్గం ప్రతీ నెలా 8వ తేదీన సమావేశమవుతుంది. ఆ సమావేశం బమితా గ్రామంలో జరిగేది. అది సుకృత్ బాయ్ నివసించే పీరా గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 13 గ్రామాల నుంచి ఎంపిక చేసిన ప్రతినిధులు పాలకవర్గంలో సభ్యులుగా ఉంటారు. సొసైటీ నిర్వహణ గురించి వారు చర్చిస్తారు. వివిధ గ్రామాల్లో కోళ్ల పెంపకం తీరును సమీక్షిస్తారు. వ్యాపారం అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను నిర్ణయిస్తారు.

25 రోజులు గడిచేసరికి కోళ్ల బరువు దాదాపు కిలో వరకు పెరుగుతుంది. ఒకొక్కరు 3 లేక 4 క్వింటాళ్ల వరకు కోళ్లను ఒక గడువులో అమ్ముకోగలుగుతారు. ఆ దశలో కోడి పిల్లలను, అవసరమైన మందులు, కోళ్ల దాణా వంటి వాటిని సొసైటీ సేకరిస్తుంది. సొసైటీకి కావలసిన ఈ ముడి సరుకులను భోపాల్ లోని రాష్ట్ర స్థాయి ఫెడరేషన్ - MPWPCL - సరఫరా చేస్తుంది. ఒక్కో గ్రామంలోని పెంపకందారులు ఒక సూపర్‌వైజర్‌ను నియమించుకున్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులను అనుసరిస్తున్నదీ లేనిదీ వారు పర్యవేక్షిస్తుంటారు. వారానికి ఒకసారి సూపర్ వైజర్ కోడిపిల్లల బరువును కూడా గమనిస్తూ ఉంటారు. ఆ వివరాలను సొసైటీకి తెలియచేస్తూ ఉంటారు. ఈ సేవలకుగాను పెంపకం దారులు విక్రయించే ఒక్కో కోడి పిల్లకు 50 పైసల చొప్పున చెల్లిస్తారు. ప్రతీసారి కోడి పిల్లలను విక్రయించిన తరువాత సుకృత్ బాయ్ కోళ్ల షెడ్డును 10-15 రోజులపాటు మూసేసి ఉంచుతుంది. ఫినాయిల్‌ను ఉపయోగించి నిమ్మ నీటితో శుభ్రంచేస్తుంది. అక్కడి నేల పూర్తిగా ఎండిన తరువాతే కొత్తగా కోడి పిల్లలను తీసుకువస్తుంది.

అప్పటి వరకు పెంచిన కోళ్లను విక్రయించిన తరువాత నేను సమితి కార్యాలయం వెళ్లి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తాను. నాకు రావలసిన పైకం తెచ్చుకుంటాను... అంటున్నారు సుకృత్ బాయ్. ఇతర కోళ్ల పెంపకందారులు కూడా అదే విధంగా కార్యాలయం వెళ్లి తమకు రావలసిన పైకం తెచ్చుకుంటారు. కోడి పిల్లలను సేకరించడం, బ్రాయిలర్ కోళ్లను తిరిగి విక్రయించడం అందరూ కలిసికట్టుగానే చేస్తారు. అలా చేయడం వల్ల ఈ బాధ్యతల భారం తగ్గిపోతుంది. వాళ్ల దృష్టి యావత్తూ ఉత్పత్తిపైనే కేంద్రీకరించడం సాధ్యమవుతుంది. అమ్మకానికి తగిన స్థాయికి కోళ్లు తయారుకాగానే సహకార సొసైటీకి సమాచారం అందిస్తారు. వాళ్లు అన్ని విధాలా అనుకూలమైన కొనుగోలుదారులను గుర్తించి తెలియజేస్తారు. వాళ్లతో సొసైటీయే సంప్రదింపులు సాగిస్తుంది. చర్చల్లో ఒక ఏకాభిప్రాయం రాగానే కొనుగోలుదారులు ఆయా గ్రామాలను స్వయంగా సందర్శిస్తారు. కోళ్లను తీసుకెడతారు. అందరి

సమక్షంలోనే కోళ్ల బరువును తూచి చూపిస్తారు. ఆ సమయంలో ప్రత్యేకంగా ఇలాంటి సహాయసహకారాల కోసమే నియమించుకున్న సూపర్‌వైజర్ కూడా హాజరవుతారు. ఆయన దగ్గర ఉండి ఒక్కో పెంపకందారుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉండేట్లు తాజాపరుస్తారు. వారిలో సుకృత్ బాయ్ దినచర్య ఎలా ఉంటుందంటే, రోజుకు మూడు సార్లు కోళ్ల మేతకు వినియోగించే పాత్రలను శుభ్రం చేస్తుంది. ఆ తరువాత కోడిపిల్లలకు మేత పెడుతుంది. నీరు అందిస్తుంది. వేసవి కాలంలో వాటిపై నేరుగా వేడి గాలి తగలకుండా తన పాత చీరలను అడ్డు తెరలుగా షెడ్డు చుట్టూ ఏర్పాటు చేస్తుంది. చలికాలంలో కోడి పిల్లలకు చల్లటి గాలి తగలకుండా షెడ్డు లోపల వేడిగా ఉండేందుకు వీలుగా చిన్న మంట ఏర్పాటుచేస్తుంది. అలాంటి చలి మంట వల్ల వచ్చే పొగ కారణంగా కోడిపిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటా, అని ఆమె చెప్పింది. ఒక గ్రామంలోని పెంపకందారులందరూ కలిసి కొన్ని నిబంధనలు పెట్టుకున్నారు. వాటిని ఆయా గ్రామాల వారూ, పరిసర గ్రామాల వారూ తప్పక నిక్కచ్చిగా పాటిస్తుంటారు. వాటిలో కొన్ని ఎలా ఉంటాయంటే చిన్న పిల్లలను షెడ్ల దగ్గరకి రానీయరు. అలాగే పిల్లులు, కుక్కలు ఆ దరిదాపులకు రాకుండా అడ్డుకోవాలి. కోళ్ల షెడ్లలోకి వెళ్లే ముందు, బయటకు వచ్చిన తరువాత కాళ్లూ చేతులను శుభ్రంగా క్లీనింగ్ ద్రావకంతో కడుగుకుని తీరాలి. అంతేకాదు, ఒకరి నిర్వహణలో ఉన్న షెడ్డులోనికి మరో పెంపకందారులు ప్రవేశించకూడదు. ఇలా వారిలో వారు కొన్ని నియమాలను నిబద్ధతతో పాటిస్తుంటారు.

మొదట్లో ఎక్కువ సంఖ్యలోనే కోడిపిల్లు చనిపోతూ ఉండేవని సుకృత్ బాయ్ చెప్పారు. దాదాపు 20 నుంచి 25 వరకు చనిపోయేవి. కానీ రోజులు గడిచే కొద్దీ ఆ సంఖ్య బాగా తగ్గింది. ఇప్పుడు 2-3 పక్షులు మాత్రమే చనిపోతున్నాయి. సుకృత్ బాయ్ మరదలు కూడా ఆమెను చూసి ప్రేరణ పొందింది. ఇటీవలే ఆమె బ్యాంకు రుణం తీసుకుంది. ఆమె సొంతంగా ఒక షెడ్డును నిర్వహిస్తున్నారు. ఆ రకంగా వారి కుటుంబంలో మరో పౌల్ట్రీ పరిశ్రమ తయారవుతోంది.

ఈ రకమైన ఉపాధి మార్గం చాలా సదుపాయంగా ఉంది. ఇంటి పట్టునే ఉంటాం. కాబట్టి ఇంట్లో ఇతర పనులు చూసుకుంటూనే కోళ్ల బాగోగులు చూసుకోవచ్చు. బిడ్డల సంరక్షణ బాధ్యతలను కూడా ప్రశాంతంగా నిర్వహించవచ్చు. సంతృప్తికరమైన ఆదాయం వస్తోంది. ఇదివరలో 300 కోడి పిల్లలను పెంచి పోషించి విక్రయించడం ద్వారా రూ.1200 నుంచి రూ.1500 వరకూ లభించేది. ఇప్పుడు 500 కోడిపిల్లలను పెంచడం ద్వారా రూ.2000 నుంచి రూ.2200 వరకూ నెలకు రాబడి సంపాదిస్తున్నాను. ఇప్పుడు నేను మా కుటుంబానికి భారంగా లేను. నా కుమారుడి చదువు సంధ్యలు నేనే స్వయంగా చూసుకోగల స్థితికి చేరుకున్నాను. అంటున్నారు సుకృత్ బాయ్ సగర్వంగా. అంతేకాదు, ''ఈమధ్య నన్ను విడిచిపెట్టి వెళ్లిపోయిన నా భర్త కూడా మళ్లీ రావడం మొదలుపెట్టాడు. నన్ను మళ్లీ ఏలుకుంటాడట. నాతో, నా కుమారుడితో కలిసి జీవనం సాగిస్తాడట. నేను ఎలా చెపితే అలా నడుచుకుంటానని మాట ఇస్తున్నాడు. ముందే చెప్పాను. నేను ఈ కోళ్ల పెంపకం ఉపాధి వదులుకోను, మరింత విస్తరిస్తాను అని. అందుకు ఆయనకు అభ్యంతరం లేదని కూడా అంటున్నాడు.'' అని చెబుతున్న ఆమె మాటల్లోనే కాదు, ముఖంలో కూడా గెలిచాననే భావన స్పష్టంగా కనిపిస్తోంది.

సేకరణ : కోళ్ల పెంపకంలో సుకృత్ బాయ్ చౌటలే విజయ గాథ మరెందరికో స్ఫూర్తిదాయకం, శీర్షికతో SAP-PLP వెబ్‌సైట్ www.sapplp.org లో వచ్చిన కథనం ఆధారంగా సమర్పిస్తున్నది. ◆

**PRADAN**
E-1/A, Ground floor and Basement,
Kailash Colony, New Delhi - 110 048.
Email : headoffice@pradan.net

ఆంగ్లమూలం :

లీసా ఇండియా, సంపుటి 16, సంచిక 2, జూన్ 2014.




*వరి వంగడాలను కాపాడడంలో ఏడాదికోసారి జరిగే విత్తన ఉత్సవాలు కీలక పాత్ర నిర్వహిస్తున్నాయి.*

# విత్తన ఉత్సవాలు - విత్తన భద్రతకు ఊతం

## ఆదిరంగంలో వరి విత్తనాల ఉత్సవాలు

### శ్రీదేవి లక్ష్మికుట్టి

**తరతరాలుగా వస్తున్న విత్తన సంపత్తిని సురక్షితంగా కాపాడుకోవాలనే ఆలోచన దక్షిణ భారత దేశంలో చాలా బలంగా వ్యాపిస్తోంది. రైతుల్లో సంప్రదాయక వరి వంగడాలను కాపాడుకోవాలనే కోరిక బలపడుతోంది. ఇందుకు ఏడాదికి ఒకసారి నిర్వహించే ఉత్సవాలు వేదికలుగా మారుతున్నాయి. ఇందుకు సేవ్ అవర్ రైస్ (మన వరి వంగడాన్ని కాపాడుకుందాం) పేరుతో ప్రారంభమైన కార్యక్రమం ఒక ఉద్యమంలా రైతన్నలను ఆకట్టుకుంటోంది. వరిసాగులో జీవవైవిధ్యానికి చోటు కల్పిస్తోంది. సామాన్య ప్రజల నోటికి తుష్టిని, పుష్టిని అందించగల వరి అన్నం అందిస్తోంది. వాతావరణ అనుకూల వరి వంగడాల అభివృద్ధిని (జెర్మ్ ప్లాజమ్) ప్రోత్సహిస్తోంది.**

తమిళనాడు రాష్ట్రంలోని వ్యవసాయదారులకు మే 25, 2013 మరపురాని రోజు, వరి సాగులో జీవవైవిధ్యం గురించిన సమగ్రమైన అవగాహన వారిలో పెంపొందించిన ఘడియలు అవి. రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి సుమారు 3000 మంది రైతు సోదరులు ఈ వేడుకల్లో అత్యుత్సాహంగా పాల్గొన్నారు. వాళ్లంతా వరి సాగు చేసే సాధారణ రైతన్నలే. రెండు రోజుల కార్యక్రమం వారిలో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపింది. కొత్త సమాచారం తెలుసుకున్నారు. ఒకరి అనుభవాలను, విధానాలను మరొకరు తెలుసుకున్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన 61 రకాల సంప్రదాయక వరి వంగడాలను వారికి అక్కడ పరిచయం చేయడం జరిగింది. వాటి విశిష్టతలను, ప్రత్యేకతలను తెలుసుకున్న తరువాత వాళ్లంతా ఎంతో ఆసక్తి చూపించారు. వాటిని తమ పంట పొలాల్లో సాగు చేసేందుకు తమ వెంట తీసుకెళ్లేందుకు ముందుకు వచ్చారు. విత్తనాలను సేంద్రీయ వ్యవసాయ పద్ధతులలోనే ఉత్పత్తి చేసేందుకు వారంతా

ఏకాభిప్రాయం వ్యక్తంచేసారు. ఒక విధంగా ఈ విషయంలో వాళ్లంతా శపథం చేసారు. దీక్ష చేపట్టారు. అలా సేంద్రీయ పద్ధతిలోనే సాగుచేసిన వంగడాల విషయంలో వారికి ఎలాంటి అనుమానాలు కలగలేదు. ఆ విత్తనాలు తమకు అన్ని విధాలా ప్రయోజనం కలిగిస్తాయనే గట్టి నమ్మకంతో వాళ్లంతా తమ వెంట తీసుకెళ్లేందుకు సిద్ధపడ్డారు. మరుసటి సంవత్సరంలో జరిగే ఉత్సవాల సమయానికి రెట్టింపు విత్తన సంపదను సిద్ధం చేయాలని తీర్మానించుకున్నారు.

## విత్తన ఉత్సవాలు – ఆవిర్భావం

తమిళనాడులోని రైతు సోదరులకు అపూర్వమైన ప్రయోజనాలను చేకూర్చి పెట్టే ఈ వార్షిక ఉత్సవాలు 2006లో ప్రారంభమయ్యాయి. మన వరి వంగడాలను కాపాడుకుందాం (సేవ్ అవర్ రైస్-ఎస్ఓఆర్) ప్రచారం ఒక ఉద్యమంలా మన దేశంలో ప్రారంభమై అప్పటికి రెండేళ్ళు అయింది.

తమిళనాడులో ఈ కార్యక్రమాన్ని క్రియేట్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది. విత్తన సంరక్షణ కోసం కృషి చేస్తోంది. ఈ సంస్థ కార్యకలాపాలను తమిళనాడు విభాగం సారథి శ్రీజయరామన్ పర్యవేక్షిస్తుంటారు. క్రియేట్ బృందం తొలి దశలో కేవలం సంప్రదాయకమైన/స్థానికంగా వాడుకలో ఉన్న దేశీయ వరి వంగడాలను సేకరించడంపైనే దృష్టి కేంద్రీకరించింది. వివిధ ప్రాంతాలలో ఉపయోగంలో ఉన్న వంగడాలను ఆ విధంగా సేకరించి ఆదిరంగంలోని తమ శిక్షణ కేంద్రంలో పండించి, వాటి ఫలితాలను అధ్యయనం చేసేందుకు ప్రయోగాలు చేపట్టింది. ఆరంభంలో రాష్ట్రంలో విస్తృతంగా వాడుకలో ఉన్న సుప్రసిద్ధ జీరక సాంబా విత్తనాలతో సహా మూడు రకాల విత్తులను మాత్రమే క్రియేట్ పరిశోధనలకు తీసుకుంది. అప్పటికి ఈ సంస్థకు విత్తనాలను శుద్ధి చేసే ప్రక్రియ కానీ, వాటిని ఎంపిక చేసుకునే విధానాలు కాని తెలియవు. అప్పటికి వారి ఆశయం విత్తనాలను పెద్ద ఎత్తున సాగుచేయడం, వాటిని కాపాడడం వరకే పరిమితంగా ఉండేది.

వరి సాగు చేసే రైతన్నలందరినీ ఒక చోట చేర్చడం చాలా ఉపయోగకరంగా ఉంటుందనే ఆలోచన వారికి 2006లో కలిగింది. దానిని ఒక వేడుకగా జరిపితే ఇంకా బాగుంటుందని వారు ఆలోచించారు. ఆ ఆలోచన ఫలితమే వరి రైతన్నల ఉత్సవం (తమిళంలో నెల్ తిరువిజా అంటారు). ఏటా మే నెలలో నిర్వహించాలన్న ఆలోచనతో మొట్టమొదటిసారి 2006లో జరిగిన ఉత్సవాల్లో 425మంది రైతులు పాల్గొన్నారు. వాళ్లు 16 రకాల సంప్రదాయక వరి వంగడాల సాగు వైపు ఆసక్తి చూపించారు. ఒక్కొక్కరికి 2 కిలోల వరి విత్తులను పంపిణీ చేసారు.

ఈ విత్తన వేడుకలు ముందుగా చాలా కాలంగా రూపొందించుకున్న ప్రతిపాదన కాదు. ఒక ప్రణాళిక ప్రకారం ఆలోచించినదీ కాదు. కేవలం ఎస్ఓఆర్ బృందం మనసులో వచ్చిన ఒక చిన్న ఆలోచన అందుకు కారణం. సాంప్రదాయక వరి సాగు కృషిలో స్థానికంగా ఆయా గ్రామాలు రైతులను, చుట్టుపక్కల ఉన్న గ్రామీణ వ్యవసాయదారులను కూడా భాగస్వాములను చేస్తే ఎలా ఉంటుందనేదే ఆ ఆలోచన. దాన్ని ఆచరణలోకి తెచ్చే ప్రయత్నంలోనే వరి సేద్యగాళ్లతో సమావేశం ఏర్పాటు చేయాలనే సంకల్పానికి దారి తీసింది. కేవలం సమావేశంలా ఉంటే ఫలితం ఉండదు, కనుక, దానిని ఓ మోస్తరు ఉత్సవాలుగా నిర్వహించాలనే ప్రతిపాదన రూపుదిద్దుకుంది. అలాంటి ఆలోచన ఒక్కసారి ఆచరణలోకి వచ్చిన తరువాత ఇక వెనక్కి తిరిగి చూడవలసిన అవసరం రాలేదు. ఏడాదికేడాది రైతన్నల ఉత్సాహం, ఆసక్తి పెరిగిపోతూ వచ్చింది. ఉత్సవాలు అద్భుత ఫలితాలకు వేదికగా మారిపోయాయి. అని వివరించారు క్రియోట్ సంస్థ ట్రస్టీ శ్రీ పొన్నంబళం. తమిళనాడు రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయానికి పితామహుడుగా గుర్తింపు పొందిన కీర్తిశేషులు డాక్టర్ నమ్మళ్వార్ ప్రతీ ఏడాది ఎప్పుడు ఎక్కడ ఈ ఉత్సవాలు నిర్వహించినా స్వయంగా వాటికి వచ్చి రైతు సోదరులకు మన సంప్రదాయక వరి వంగడాలను కాపాడుకోవలసిన అవసరం గురించి వివరించేవారు. ఆయనకృషికారణంగానేఇదిఒకమహాఉద్యమంగా గ్రామగ్రామానికీ విస్తరించింది అని చెప్పారు పొన్నంబళం. విత్తన ఉత్సవాలు, విత్తన సంరక్షణ, సేంద్రీయ సాగు విధానం గురించి అనేకమంది నుంచి అందిన సహాయ సహకారాలతో శ్రీ జయరామన్ రాష్ట్రమంతటా వ్యాప్తి చేయగలిగారు.

విత్తన ఉత్సవాలకు రాష్ట్రంలోని మీడియా నుంచి అందిన మద్దతు ఎంతో ఉపయోగపడింది. అరువదం కురవాయి అంటే కేవలం 60 రోజులలోనే పంట చేతికి అందించే వరి వంగడం గురించిన సమాచారాన్ని అక్కడి పత్రికలు విస్తృతంగా ప్రచారం చేసాయి. విత్తన ఉత్సవాల సమయంలో ఒక రైతన్న ఈ విత్తనాలను ఎస్ఓఆర్ బృందానికి అందించారు. ఇది విపరీతంగా రైతన్నలను ఆకట్టుకుంది. ముఖ్యంగా తమిళనాడు వ్యవసాయ ప్రాధాన్యత కల అంశాలతో వెలువడే పసుమై వికటన్ పత్రిక ఈ విషయాన్ని కవర్ స్టోరీ చేయడంతో విస్తృత ప్రచారం లభించింది. ఈ మేగజైన్ కృషి కారణంగా, సాంప్రదాయక వరి వంగడాలను ప్రోత్సహించవలసిన అవసరం, వాటి ఉపయోగాలు రైతన్నలకు అర్థమైంది. దేశీయంగా తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న వరి వంగడాలను ఆశ్రయించడంలో రైతన్నల మనసులలో మార్పు తీసుకురావడం సాధ్యమైంది. ఫలితంగా, ఈ రోజున దాదాపు 2 వేల నుంచి 3 వేల మంది అన్నదాతలు అరువదం కురువై విత్తనాలను ఆధారం చేసుకునే వరి సాగు చేస్తున్నారు. ఇదే విధంగా, కట్టుయానం, మప్పిలై

చెంబ వంగడాలు కూడా విస్తృత ప్రచారం కారణంగా రైతన్నల చేలను సస్యశ్యామలం చేస్తున్నాయి.

## విత్తన వైవిధ్యం – నిరంతర కృషి

సాంప్రదాయక వంగడాలను నిత్యనూతనంగా అభివృద్ధి చేయడానికి, వాటిని పరిరక్షించడానికి నిరంతర కృషి అవసరం. అందుకు విత్తన ఉత్సవాలు ఒక వేదికగా నిలుస్తున్నాయి. ఈ వేదికల మధ్య వ్యవసాయదారులు వైవిధ్యంతో కూడిన వంగడాలను పరస్పరం అందించుకునేందుకు, మరిన్ని మేలైన రకాలను అభివృద్ధి చేసేందుకు స్ఫూర్తినిస్తున్నాయి. ప్రారంభంలో కొద్ది మంది రైతులు మాత్రమే ఈ విత్తన వేదికలపై లభించిన విత్తులను తమ గ్రామాలకు తీసుకెళ్లి తమ పంట పొలాల్లో సాగు చేసారు. కానీ, ఇప్పుడు, అలా తీసుకెళ్లి సాగు చేసే రైతన్నల సంఖ్య గణనీయంగా పెరిగింది. అలా ఈ విత్తన ఉత్సవాల్లో పాల్గొని విత్తనాలను ఎంపిక చేసుకుని తీసుకెళ్లే రైతుల సంఖ్య ఏటా పెరిగిపోతోంది.

ఇప్పటివరకు రైతులకు అందుబాటులో ఉంచిన 61 రకాల వంగడాల్లో కొన్ని ఎక్కువ రైతుల అభిమానాన్ని సంపాదించుకుంటున్నాయి. ఎస్ఓఆర్ పరిశీలన ప్రకారం, వాటిలో 19 రకాలు ఎక్కువ ఆదరణకు నోచుకుంటున్నాయి. వాటిలో మప్పిళై సాంబ, జీరక సాంబ, కట్టుయానం, కట్టు పొన్ని, అరువదం కరువై వంటివి ముఖ్యమైనవి. రైతుల నుంచి వాళ్లు పండించిన సంప్రదాయక విత్తనాల నుంచి వచ్చిన దిగుబడి విషయంలో పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా, వాతావరణం అనుకూలంగా లేని సమయంలో కూడా వారికి మంచి పంటనే చేతికి అందించాయి.

కొన్ని సందర్భాలలో, విత్తనాల దిగుబడిని అధికం చేసేందుకు ఎస్ఓఆర్ చాలా కష్టపడవలసి వచ్చింది. ఉదాహరణకు, గడచిన రెండేళ్ల కాలంలో తమిళనాడులోని కావేరీ పరీవాహకప్రాంతాల్లో కరువు తీవ్రంగా ఏర్పడింది. విత్తన ఉత్సవాల వేళకు తగినన్ని విత్తన సంపదను సిద్ధం చేసేందుకు భూములను లీజు పద్ధతిపై అద్దెకు తీసుకోవలసిన పరిస్థితి ఎదురైంది.

## పెరుగుతున్న ఆదరణ

విత్తన ఉత్సవాలు రైతన్నలను చాలా ఆకట్టుకుంటున్నాయి. 2013లో నిర్వహించిన ఉత్సవాలకు తమిళనాడుకు దక్షిణ దిశగా ఒక చివర ఉన్న కన్యాకుమారి జిల్లా నుంచి మరో కొసన ఉత్తరాన ఉన్న తిరువళ్లూరు జిల్లాల నుంచి రైతన్నలు ఎంతో ఉత్సాహంతో వచ్చి పాల్గొన్నారు. 2006లో కేవలం 400 మంది మాత్రమే ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. ఆ సంఖ్య 2013 నాటికి 3000 దాటిపోయింది.

> 2006 నాటికి విత్తన ఉత్సవాల్లో పాల్గొనే వారి సంఖ్య కేవలం 400 మంది రైతన్నలు మాత్రమే. ఇప్పుడు ఆ సంఖ్య 3000 దాటిపోయింది.

టేబుల్ నెం.1 విత్తన ఉత్సవాల సందర్భాలలో వంగడాలను స్వీకరించిన రైతన్నల సంఖ్య

| సంవత్సరం | వంగడాల సంఖ్య | రైతన్నల సంఖ్య |
|---|---|---|
| 2005-06 | 16 | 425 |
| 2006-07 | 26 | 1176 |
| 2007-08 | 28 | 1629 |
| 2008-09 | 47 | 2016 |
| 2009-10 | 51 | 2320 |
| 2010-11 | 53 | 2860 |
| 2011-12 (నవంబర్ 2011) | 61 | 2900+ |
| 2013 | 63 | 3000+ |

సేకరణ : పాండీ, జూలై 2013

ఇలా వ్యవసాయదారుల్లో ఆదరణ పెరిగిపోవడంతోపాటు ఇతర రంగాలకు చెందిన సంస్థలు, వ్యక్తులు కూడా ఎంతో ఆసక్తి చూపించడం ఎక్కువయింది. కొండంత అండగా నిలుస్తూ వచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహించే వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు వాళ్లే కాక ఎంతో మంది ప్రముఖులు కూడా ఉత్సాహం చూపిస్తూ వచ్చారు. చాలా సంవత్సరాలుగా నాబార్డ్ వంటి ఆర్థిక సంస్థలు, ఇంకా వాణిజ్య బ్యాంకులు ఈ రెండు రోజుల వేడుకలకు తమ మద్దతు అందిస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం కూడా ఆసక్తి చూపిస్తోంది. గత ఏడాది వ్యవసాయ శాఖ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని రైతన్నలకు ఆహ్వాన పత్రికలను అందజేసే బాధ్యతను స్వీకరించింది. ఫలితంగా దక్షిణాన కన్యాకుమారి నుంచి ఉత్తరాన తిరువళ్లూరు వరకు రైతన్నలు వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ ఉత్సవాలను నిర్వహించడంలో రైతన్నలు నిర్వహించిన పాత్ర కూడా ఏ మాత్రం తక్కువ చేసి చూపడానికి లేదు. ఆరంభంలో రైతన్నలు నిర్వహణ ఖర్చుల భారం స్వీకరించలేదు. కాని మెల్లిగా వాళ్లు ప్రవేశ రుసుము చెల్లించేందుకు ముందుకు వచ్చారు. ఆరంభంలో కేవలం రు.10లు ఉన్న ప్రవేశ రుసుము క్రమంగా రు.50కి తరువాత గత ఏడాది రు.100కి చేరింది. అయినా వారిలో ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. ఇప్పుడు ఈ విత్తన ఉత్సవాలకు రైతన్నల్లో ఎంత గిరాకీ ఉన్నదంటే అది రంగంలో జరిగే ప్రధానమైన ఉత్సవాలకు హాజరుకాలేని రైతన్నల కోసం ఎక్కడికక్కడ జిల్లాల్లో కూడా చిన్న స్థాయిలో విత్తన ఉత్సవాలు నిర్వహిస్తూ వచ్చారు.

ఇలా జిల్లాల స్థాయిలో జరిగే ఉత్సవాలకు అదనంగా వేలాది మంది రైతన్నలు హాజరవుతున్నారు, సేంద్రీయ వరి సాగు పనుల్లో

## మన వరి వంగడాన్ని కాపాడుకుందాం – ఉద్యమం

మన వరి వంగడాన్ని కాపాడుకుందాం ఉద్యమం రూపంలో మన దేశంలో కేరళలోని థానాల్‌లో ప్రారంభమైంది. తమిళనాడులో దీనిని క్రియేట్ సంస్థ చేపట్టింది. ఒడిశాలో లివింగ్ ఫార్మ్స్ అనే సంస్థ నిర్వహిస్తోంది. ఆ తరువాత ఇది పశ్చిమ బెంగాల్‌లో 2009 నాటికి విస్తరించింది. ఈ ఉద్యమం అయిదు ప్రధానమైన ఆశయాలతో ప్రారంభమైంది. 1. వరి అనుకూల పర్యావరణ వ్యవస్థలను కాపాడడం. 2. వరి సాగు సంప్రదాయం, వైవిధ్యం పరిరక్షించడం. 3. సంప్రదాయక విజ్ఞానాన్ని సంరక్షించడం. 4. జివిఓలను, టాక్సిక్‌లను నిరోధించడం. 5. ప్రజలకు సురక్షితమైన, పోషకాహారం అందించడం. వివిధ రాష్ట్రాలలో ఆయా సంస్థలు నిర్విరామంగా కృషిచేస్తున్నాయి.

పరోక్షంగా చురుగ్గా పాల్గొంటున్నారు. వారికి కావలసిన విత్తనాలను ఉత్సవాల్లో పాల్గొంటున్న రైతన్నలు వారికి సమకూరుస్తున్నారు. అంటే తమ వాటాతో పాటు ఉత్సవాల్లో పాల్గొనే రైతన్నలు తమ గ్రామాలలోని ఇతరుల కోసం కూడా విత్తనాలను సేకరించి వెంట తీసుకెళ్లి వాళ్లకి కూడా అందిస్తున్నారు. ఒకరకంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతన్నలు మరెందరికో ప్రతినిధులుగా వస్తున్నారన్నమాట.

## సాధించిన ఫలితాలు

సేంద్రీయ పద్ధతుల్లో సంప్రదాయక వరి సాగు చేస్తున్న రైతులకు ఆర్థికంగా కూడా ప్రయోజనాలు లభిస్తున్నాయి. సాధారణ వ్యవసాయ పద్ధతిలో రైతులు దాదాపు రూ.15000 నుంచి రూ.20000 వరకు వివిధ అవసరాలకు ఖర్చు చేయవలసి ఉంటుంది. ఫలితంగా వారికి 32 బ్యాగుల వరి ధాన్యం పండుతుంది. (ఒక్కో బ్యాగులో 60 కిలోల వరి ఉంటుంది) అంటే సగటున వారు రు. 5000 ఖర్చు చేస్తున్నారు. ఫలితంగా కేవలం 24 కిలోల ధాన్యం పండిస్తున్నారు. అదీకాక వారు పండించిన ధాన్యానికి బహిరంగ మార్కెట్లో ఒక బ్యాగుకు రు.1200 సంపాదించిపెడుతుంది. అదే సాధారణ వరి ధాన్యం అమ్మితే వారికి లభించేది కేవలం రు.800 మాత్రమే, అని వివరించారు శ్రీజయరామన్. అయితే బాధాకరమైన వాస్తవం ఏమిటంటే, ఇలా పండించిన సంప్రదాయక ధాన్యం సేకరణకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు. కేవలం అధిక దిగుబడినిచ్చే, లేదా, హైబ్రీడ్ ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం సేకరించేందుకు ఆసక్తి చూపిస్తోంది.

చాలా కుటుంబాలు, ముఖ్యంగా చిన్న రైతులు, సంప్రదాయక ఎర్ర బియ్యం శుద్ధి చేయడం, దానిని విక్రయించడంపైనే ఆధారపడి జీవనం సాగిస్తూ ఉంటాయి. తమిళనాడులోని వివిధ వర్గాల ప్రజలు ఇప్పుడు సంప్రదాయక ఎర్ర అన్నం గురించే మాట్లాడుకుంటున్నారు. దాని వల్ల కలిగే ప్రయోజనాలను అవగాహన చేసుకోగలుగుతున్నారు. తాజా పరిస్థితి ఏమిటంటే చాలా పట్టణాల్లో, ఓ మోస్తరు నగరాల్లో కూడా సూపర్ మార్కెట్లలో ఈ సంప్రదాయకమైన ఎర్ర ధాన్యం ప్యాకెట్లు లభిస్తున్నాయి. ఇది అపూర్వమైన మార్పు. ఒకప్పుడు తెల్ల బియ్యం తప్ప మార్కెట్లో మరే రకం కనిపించేది కాదు. మరో ఆసక్తికరమైన మార్పు ఏమిటంటే విత్తన ఉత్సవాల్లో సేకరించిన వంగడాల సాయంతో సాగు చేసి ధాన్యం పండిస్తున్న రైతుల కుటుంబాలు వారి ఇండ్లలో నిత్యావాడకానికి ఈ ఎర్ర బియ్యాన్నే ఉపయోగిస్తున్నాయి. కొంత ధాన్యాన్ని ప్రత్యేక అవసరాలకోసం అంటే పెండ్లిండ్లు, పండుగలు, పబ్బాలకు కూడా దాచిపెట్టుకుంటున్నారు. ఇదివరకటి రోజుల్లో ఈ రైతన్నల కుటుంబాలు తాము పండించిన ధాన్యం అమ్మివేసుకుని, తమ ఇండ్లలో అవసరాలకు తెల్ల బియ్యం మార్కెట్ నుంచి కొని తెచ్చుకునేవి.

సేవ్ అవర్ రైస్ ఉద్యమ జాతీయ కో-ఆర్డినేటర్ ఉష అభిప్రాయం ప్రకారం ''సంప్రదాయక వరి సాగుకు రైతన్నలు చూపిస్తున్న ఆసక్తి మాకు చాలా ప్రోత్సాహం ఇస్తోంది. వారి ఉత్సాహం చూస్తే సంప్రదాయక వ్యవసాయ జీవ వైవిధ్యానికి వారు ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతుంది. వారికి తగిన అవకాశాలు అందిస్తే వారు వాటిని అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నారనే వాస్తవం మనకు తెలుస్తుంది. వారి అనుభవాలు తెలుసుకున్నపుడు ఈ రకమైన వంగడాలకు మంచి భవిష్యత్తు ఉన్నదని మనం గుర్తించవచ్చు. మంచి దిగుబడి, పోషకాల సమృద్ధి, వాతావరణ తేడాలను తట్టుకోగల వంగడాలను సంరక్షించడం సాధ్యమేనన్న నమ్మకం పెరుగుతోంది.''

సంప్రదాయక విత్తన ఉత్సవాలు చాలా కీలకమైన లక్ష్యాన్ని సాధించగలిగింది. అదేమిటంటే సంప్రదాయక వరి వంగడాలను రైతుల్లో ప్రవేశపెట్టగలిగింది. అలాంటి విత్తులను సంరక్షించడంపై వారిలో శ్రద్ధ తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా పెంపొందించగలిగింది. ఇప్పుడు సంప్రదాయక సాగు పద్ధతుల్లో వరి సాగుపై రైతన్నలు ఆసక్తి చూపిస్తున్నారు. విత్తనాలను కాపాడేందుకు వారు ముందుకు వస్తున్నారు. వరి సేద్యంలో వ్యవసాయ జీవ వైవిధ్యం కాపాడడంతోపాటు ఆరోగ్యదాయకమైన ఎర్రబియ్యం ఆహారంలో భాగంగా చేర్చడం సాధ్యమవుతోంది. చిట్టచివరిగా వాతావరణ తేడాలను నిలదొక్కుకోగలిగిన వరి వంగడాలు సిద్ధం చేసుకోవడం సాధ్యమవుతోంది. ◆

**శ్రీదేవి లక్ష్మి కుట్టి సేవ్ అవర్ రైస్** ఉద్యమ సలహాదారుగా పనిచేస్తున్నారు. సురక్షితమైన ఆహారం, సుస్థిరమైన వ్యవసాయ విధానం వంటి అంశాలపై వ్యాసాలు రాస్తూ ఉంటారు. ఆమెను slakshmikutty@rocketmail.comలో సంప్రదించవచ్చు.

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 16, సంచిక 1, మార్చి 2014.

# హరిత శక్తా - జీవనోపాధులా?!

ఫరూక్ రియాజ్, అనిత సూద్, సరోజ్ భయానా మరియు అల్ప్ నా శర్మ

**బంజరుగా మారిన కల్పవల్లి అటవీ భూమి స్థానిక ప్రజల ప్రయత్నంతో పునరుద్ధరింపబడి తిరిగి జీవం నింపుకుంది. కానీ హరిత శక్తి పేరుతో మళ్ళీ ఆ భూమి పతనావస్థకు చేరుకుంది. గాలి మరలు 'క్లీన్ ఎనర్జీ'ని ఉత్పన్నం చేస్తాయన్న దాన్లో సందేహం లేదు. కానీ దాని మూల్యం ఎంత? ఈ గాలిమరల ఏర్పాటు ఉదంతం మనకు ఇంకో కొత్త కోణం చూపిస్తోంది.**

అనంతపూర్ జిల్లా, రొద్దం మండలంలోని కల్పవల్లి అటవీ ప్రాంతం ప్రధానంగా పచ్చిక బయళ్ళు, ముళ్ళ పొదలు ఉన్న ఉష్ణమండల అటవీ జీవావరణం. కల్పవల్లి అడవి ఉరుదల కొండ నుండి తుమ్మ కొండ వరకూ వున్న ప్రాంతంలో 7,500 ఎకరాల మేర విస్తరించి ఉంటుంది. ఈ అడవి, ఆ చుట్టుపక్కల ప్రాంతం అంతా ఈత చెట్లతో నిండి ఉంటాయి. ఈ ఈత పండ్లను అమ్ముకునే ఇక్కడి ప్రజలు వారి జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటారు.

కల్పవల్లి ప్రాంతంలోని చిట్టడవులు, పచ్చిక బయళ్ళు అనేక రకాల జీవావరణ సేవలు అందచేస్తూ ఆ ప్రాంతపు ప్రజలకు అండగా నిలుస్తాయి. గ్రామస్థులు చీపురు గడ్డి సేకరించి, చీపుర్లు కట్టి మార్కెట్‌లో అమ్ముతారు. ఇక్కడ వేలకొద్దీ ఈత చెట్లు ఉన్నాయి. ఇక్కడి లోయల్లో పారే ఏరులే వీటికి ఆధారం. నీటికి సంబంధించిన మరో కీలకమైన, ముఖ్యమైన జీవావరణ వనరు, ఆ ప్రాంతపు చెరువుల సముదాయం. ముష్టికోవెల నుండి మొదలై దిగువ వరకూ వున్న వరుస చెరువులకు నీరు అందించేది, ఎగువన వున్న కల్పవల్లి ప్రాంతమే. ఈ చెరువులను రైతులు వ్యవసాయానికీ, త్రాగడానికీ మరియు ఇతరత్రా అవసరాలకు ఉపయోగించుకుంటారు.

కల్పవల్లి లోని వాగులు కేవలం మనుషులకే కాదు, వన్య ప్రాణులకు కూడా ఆధారం. ఈ ప్రాంతంలో అంతరించిపోతున్న జాతుల పక్షులు కూడా ఎన్నో ఉన్నాయి.

## స్థానిక ప్రజలు చేపట్టిన జీవావరణ పునరుద్ధరణ

కాలక్రమేణా అడవులు పతనమయ్యాయి. టింబక్టు కలెక్టివ్ అనే ఒక స్వచ్ఛంద సంస్థ స్థానిక ప్రజలతో కలిసి ఆ అడవిని మళ్ళీ మామూలు స్థితికి తెచ్చి, అక్కడి జీవావరణం జీవం నింపుకుని



*అభివృద్ధి చొరవలు చేపట్టక ముందు కనిపిస్తున్న ప్రశాంతమైన భూదృశ్యం*

అక్కడి ప్రజల జీవితాలకు అండగా ఉండే విధంగా చెయ్యడానికి పూనుకుంది. టింబక్టు కలెక్టివ్ సంస్థ ఈ పునరుద్ధరణ కార్యక్రమాన్ని 1992లో ముష్టికోవెల అన్న గ్రామంలో మొదలుపెట్టి, 'జీవావరణ పునరుద్ధరణ' అన్న భావనను ప్రోత్సహించడం మొదలుపెట్టింది.

కల్పవల్లి చిట్టడవులలోని జీవావరణాన్ని పునరుద్ధరించడం వలన ప్రధానంగా కలిగిన ప్రయోజనం, ఆ ప్రాంతంలోని చెరువులు మళ్ళీ నీటిని నింపుకోవడం.

గ్రామం చుట్టూ ఉన్న కొండలలోని 125 ఎకరాల రెవెన్యూ బంజరు భూముల సంరక్షణా కార్యక్రమం మొదలుపెట్టేలా గ్రామస్థులను ఒప్పించడానికి దాదాపు ఒక సంవత్సరం పైగా పట్టింది. అయితే ఈ కార్యక్రమం మొదలుపెట్టిన వెంటనే ప్రయోజనాలు కనిపించసాగాయి. క్రమంగా మరొక 7 గ్రామాలు కూడా ఈ కార్యక్రమంలో చేరాయి. ఈనాడు దాదాపు 7,500 ఎకరాల రెవెన్యూ బంజరు భూములను సంరక్షించి అటవీ భూములుగా తీర్చిదిద్దడం జరుగుతోంది.

ఈ కార్యక్రమాల నిర్వహణలో స్థానిక ప్రజలు భాగస్వామ్య పద్ధతి పాటించడం జరిగింది. ఒక్కో గ్రామంలో ఒక వన సంరక్షణ కమిటీ (వి.ఎస్.సి. - ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ) ఉంటుంది. కొంతమంది గస్తీవాళ్ళ సహాయంతో వి.ఎస్.సి.లు అన్ని పనులను పర్యవేక్షిస్తూ వుంటాయి. వీరు ప్రతి రోజు వారి సంరక్షణలో ఉన్న ప్రాంతాలలో గస్తీ తిరుగుతూ ఏవైనా మంటలు చెలరేగినా, ఎవరైనా చెట్లు నరకడానికి ప్రయత్నించినా ఆ సమాచారాన్ని వి.ఎస్.సి.లకు అందచేస్తే, అప్పుడు వి.ఎస్.సి.లు తక్షణం తగిన నివారణ చర్యలు చేపడతాయి. చెట్లు నరుకుతూ

ఎవరైనా పట్టుబడితే వారికి కఠినమైన జరిమానా విధించడం జరుగుతుంది. ఇంక స్థానికులు ఎవ్వరూ ఆ చెట్లను నరికే ప్రయత్నం చేయడం లేదు.

ఒక్కో వి.ఎస్.సి.లో మంటలను నియంత్రించే స్వచ్ఛంద కార్యకర్తలు ఉంటారు. మంటలు వ్యాపించడాన్ని నివారించడానికి ప్రతి సంవత్సరం, దాదాపు 60-75 కి.మీ. మేర ఫైర్ బ్రేక్స్ (మంటలవ్యాప్తినిఅరికట్టేఅడ్డు)ఏర్పాటుచేయడంజరుగుతుంది. ఆ చుట్టుపక్కల 25 కి.మీ. దూరంలో వున్న గ్రామాలనుండి మేకలను, గొర్రెలను తోలుకుని వచ్చే గొల్లవాళ్ళను అడవిలో మంటలు వెయ్యకుండా వుండేట్లు ఒప్పించడానికి వి.ఎస్.సి. సభ్యులు, నిఘా పనివారు, మరియు కలెక్టివ్ సంస్థ యొక్క సిబ్బందికి చాలా కాలం పట్టింది.

ఈ వన సంరక్షణ కమిటీలు 2002లో కల్పవల్లి ట్రీ గ్రోయర్స్ కోపరేటివ్ కింద చేర్చబడ్డాయి. ఆ తరువాత 2008లో ఎ.పి.ఎం. ఎ.సి.ఎస్. కింద నమోదు కాబడ్డాయి.

గ్రామస్థులు కల్పవల్లి సంస్థ సహాయంతో ఆ బంజరు భూమిని పచ్చదనంతో నింపారు. దానితోబాటుగా వారు అనేక జీవావరణపరమైన ప్రయోజనాలను కూడా పొందారు. టింబక్టు కలెక్టివ్ సంస్థ ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టినప్పుడు ఆ కొండలన్నీ దాదాపు బోడిగా వుండేవి. క్రమంగా కొండల మీద మిగిలివున్న మోళ్ళు చిగురించాయి. గడ్డి మొలకెత్తింది. పక్షులు తిరిగి వచ్చి కొత్త చెట్లు కూడా పెరగడం జరిగింది. భూమి మెరుగుపడింది. అనేక రకాల జాతుల గడ్డి మళ్ళీ పెరగడం మొదలయింది. చెట్లను నాటడం అలవాటుగా మారింది. ఇందువలన చెరువులలో నీరు ఎక్కువగా చేరి, భూగర్భజలం వృద్ధి చెందింది. కల్పవల్లి అటవీ జీవావరణ పునరుద్ధరణ కార్యక్రమం వలన జరిగిన పెద్ద మేలు, చెరువులు తిరిగి నీటిని నింపుకోవడం.

కల్పవల్లి ప్రాంత ప్రజలు పునరుద్ధరించిన రక్షిత వన్య ప్రదేశం కలప్యేతర అటవీ ఉత్పత్తుల రూపంలో ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఈ ప్రదేశం చెన్నె కొత్తపల్లి మరియు రొద్దం మండలాలలోని గ్రామాలకు పైగా నీటి పరీవాహక ప్రాంతంగానూ, పశువుల మేతకు పచ్చిక బయలుగాను పనిచేస్తోంది. అంతేకాక, ప్రజలచే సంరక్షింపబడుతున్న ఈ విశాలమైన ప్రదేశం వన్యప్రాణులకు నివాసంగా మారింది.

ఈ ప్రాంతంలో తోడేళ్ళు, చిరుతపులులు వంటి పెద్ద మాంసాహార జంతువులు ఉండడం చూస్తే కల్పవల్లి కేవలం ఒక స్థానిక పరిరక్షిత అటవీ ప్రాంతంగా కాక ఒక జీవవైవిధ్య పరిరక్షణా కేంద్రంగా కూడా ప్రముఖ పాత్ర వహిస్తోందని చెప్పవచ్చు.

> కల్పవల్లి చిట్టడవులలోని జీవావరణాన్ని పునరుద్ధరించడం వలన ప్రధానంగా కలిగిన ప్రయోజనం, ఆ ప్రాంతంలోని చెరువులు మళ్ళీ నీటిని నింపుకోవడం.

ఇక్కడి ప్రజలకు అడవులు అంటే కేవలం జీవావరణ ప్రయోజనాలు కూర్చేవి మాత్రమే కాదు. కల్పవల్లిలో, అడవి మధ్యలో స్థానికులు అత్యంత పవిత్రంగా భావించే గోపాలస్వామి గుడి ఉంది. మతం పట్ల, సంస్కృతి పట్ల స్థానిక ప్రజలకు వున్న గట్టి నమ్మకమే వారు వారి అడవులను, జీవావరణాన్నీ కాపాడుకునేలా చేసింది.

## అభివృద్ధి చొరబాటు

2011 సంవత్సరంలో ప్రశాంతమైన కల్పవల్లిలో అకస్మాత్తుగా ఒక విండ్ పవర్ (గాలి విద్యుత్) ప్రాజక్టు ప్రవేశించింది. ఎనెర్కాన్ అనే పవన విద్యుదుత్పాదక కంపెనీ ఆ ప్రాంతంలో గాలి మరలను స్థాపించి ఆ పచ్చని లోయను వ్యాపార స్థలంగా మార్చేసింది. కంపెనీ వారి ప్రయోజనాలు ప్రజలు చేపట్టిన సంఘటిత కార్యక్రమాలకు అంతరాయం కలిగించి ఆ ప్రాంతపు పర్యావరణ మరియు సామాజిక - ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసాయి.

స్థానిక ప్రజల అభిప్రాయాలు, మనోభావాలకు ఏమాత్రం విలువనివ్వకుండా ఈ సుసంపన్నమైన, వైవిధ్యభరితమైన జీవావరణాన్ని పూర్తిగా గాలి మరల నిర్మాణానికి ఇచ్చివేయడం జరిగింది. కొండల పైభాగాలు చదును చేయబడ్డాయి. అసలే నీటి కొరత వున్న ఈ ప్రాంతంలో గాలి మరలు నిలబెట్టడానికి నిర్మించిన దిమ్మలను క్యూరింగ్ చెయ్యడానికి అత్యంత విలువైన నీరు ఎంతో వినియోగించడం జరిగింది.

గాలిమర భాగాల రవాణా కోసం కంపెనీ వారు పెద్ద ఎత్తున అడ్డదిడ్డంగా వేసిన రోడ్ల కారణంగా ఆ పల్లె ప్రాంతమంతా నాశనం అయ్యింది. ఈ రోడ్ల నిర్మాణంలోను, కొండలను చదును చెయ్యడంలోను ఎన్నో చెట్లను నరికివేయడం జరిగిందని గ్రామస్థులు చెప్పారు.

కొండల మీద వాహనాల రద్దీ, రణగొణ ధ్వని గ్రామస్థులకు చాలా అసౌకర్యం కలిగించాయి. కొండ మీదకి వెళ్ళడానికి వేసిన రోడ్ల వలన గొర్రెలకు, పశువులకు ఆ కొండవాలు ఎక్కడం కష్టతరంగా మారింది. ఈ రోడ్లు వెయ్యడం వలన పశువులు దాటవలసిన వాలు 7 మీ. ఉంటుంది. ఇది ఈ పశువులకు, గొర్రెలకు దాటడం సాధ్యపడదు కాబట్టి అవి కొండ ఎక్కి, మేత మెయ్యలేకపోతున్నాయి. అదే రోడ్లు వెయ్యక ముందు అవి ఏ ఆటంకం లేకుండా కొండమీదికి ఎక్కి మేత మేసేవి. కొండకు వెళ్ళే దారిలో అడ్డంగా రోడ్లు వెయ్యడం వలనా, కల్పవల్లి పచ్చికబయలు పాడైపోవడం వలన చుట్టుపక్కల గ్రామాల నుండి ఇక్కడికి వచ్చే గొర్రెలు ఇప్పుడు మేత కోసం ఎన్నో మైళ్ళ దూరం వెళ్ళవలసివస్తోంది. కొండల మీద నిర్మాణ కార్యక్రమం చేపట్టడం

## టింబక్టు కలెక్టివ్

1990 దశకం మధ్యలో, అనంతపూర్ జిల్లాలోని కరువు ప్రాంతంలో, సి.కె.గంగూలీ (బబ్లు) మరియు అతని జట్టు సభ్యులు ఒక సంస్థను స్థాపించి, అస్సలు జీవించడానికి వీలు కానటువంటి కఠినమైన వర్షాభావ పరిస్థితి నెలకొన్న ఆ పర్యావరణంలో మార్పు తీసుకుని రావడానికై పనిచేయడం మొదలుపెట్టారు. వారు 40 ఎకరాల బంజరు భూమిని కొని, ఆ భూమిని మొత్తం పచ్చదనంతో నింపడానికి తగిన ప్రణాళికను వేసుకుని ఆ ప్రాంతంలో చెట్లు నాటారు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకుని కృషిచేయగా ఆ బంజరు భూమి అంతా పచ్చదనాన్ని నింపుకుంది. వారి సంస్థకు వారు 'టింబక్టు' అన్న పేరు పెట్టుకున్నారు. టింబక్టు అంటే భూమి మీది ఆఖరి దిగంతం అని అర్థం.

టింబక్టు సంస్థ అనంతపూర్ జిల్లాలోని చెన్నె కొత్తపల్లి, రొద్దం మరియు రామగిరి మండలాల్లోని దాదాపు 100 గ్రామాలకు చెందిన 30,000 మంది స్థానిక ప్రజలతో కలిసి పనిచేయడం మొదలుపెట్టారు. ప్రత్యేకించి చిన్న, సన్నకారు రైతులు, దళితులు మరియు భూమిలేని కూలీల మీద దృష్టిపెట్టడం జరిగింది. వారి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే విధంగా వారికి సాధికారత కల్పించడం జరిగింది. బంజరుగా మారిన అటవీ భూములలోని జీవావరణాన్ని పునరుద్ధరించడానికై, భూమిని, అడవినీ కాపాడే అనేకసమూహాలుఏర్పాటుచేయబడ్డాయి. గ్రామాలలో సేంద్రీయ వ్యవసాయం, చెట్ల పెంపకం ప్రోత్సహించడం జరిగింది. ప్రజలలో ఒక సమగ్రమైన దృష్టికోణం అలవడడానికి ఇది ఎంతో దోహదపడింది.

వలన గడ్డి ఎండిపోయింది. గడ్డి మీద దుమ్ము పేరుకోవడం వలన కూడా ఆ గడ్డి గొర్రెలు, పశువులు మెయ్యడానికి పనికిరాలేదు. పొలాల మీద కూడా దుమ్ము పేరుకుపోవడం మరియు ధ్వని కాలుష్యం వలన రైతులకు, గ్రామస్థులకు ఎంతో అసౌకర్యం కలిగింది.

గాలిమరల నిర్మాణం కోసం అటవీ ప్రాంతానికి తెప్పించిన సామాగ్రి తాలూకు ప్లాస్టిక్ సరుకుని తిని గోపాలస్వామి గుడికి చెందిన ఎన్నో ఆవులు చచ్చిపోయినట్లు చెబుతున్నారు. వాహనాలు గుద్దుకొని కూడా అనేక ఆవులు చనిపోయాయి. వారు అత్యంత పవిత్రంగా పరిగణించే ఆవుల మరణాలు స్థానికుల భావాలను దెబ్బతీసాయి. గుడి దగ్గర వున్న వాగులు ఎండిపోయాయి. వున్న కొద్దిపాటి నీరు కూడా కలుషితమైపోయి పశువులు తాగడానికి ఇంక పనికిరాకుండా పోయాయి.

గాలిమరలు ఏర్పాటు చేసిన తరువాత కల్పవల్లిలోని వాగులు ఎండిపోసాగాయి. విద్యుత్ స్థంబాలు, ఎర్తింగ్ వంటివి భూమిలోపల వేడిని కలుగచేయడంతో భూగర్భ జలం తగ్గిపోయిందని స్థానిక ప్రజల నమ్మకం. నేలకోత కారణంగా కూడా లోయలోని వాగులు మూసుకుపోతున్నాయి. వీటి ప్రభావం నేరుగా అక్కడి ఈతచెట్లపై పడి, చెట్లు ఎండిపోయాయి. చెట్లు ఎండిపోవడంతో ఈతపళ్ళు పండక, ఆ పళ్ళు అమ్ముకుని బతికే వారి జీవనోపాధి దెబ్బతింది. దాదాపు ఆ లోయలోని అన్ని వాగులూ ఎండిపోవడంతో ఆ అటవీ ప్రాంతం జీవావరణపరంగా ఎంతో పతనానికి గురయ్యింది.

## కలతపడ్డ కల్పవల్లి

కల్పవల్లిలో గాలిమరలు ఏర్పాటు చేసే కార్యక్రమంలో ఒక వైపు జీవావరణం దెబ్బతింటే, మరొక వైపు ప్రజల జీవనోపాధి దెబ్బతింది. ఇప్పుడు ఆ కొండల మీద విద్యుత్ ఉత్పాదన కొరకు నిర్మించిన పెద్ద గాలిమరలు కొలువై వున్నాయి. టింబక్టు కలెక్టివ్ రెండు దశాబ్దాలకు పైగా కష్టపడి పునరుద్ధరించిన ఈ ఉష్ణమండల చిట్టడవిని ఇప్పుడు ఈ 'క్లీన్ విండ్ మిల్స్' (నిర్మలమైనవిగా చెప్పబడుతున్న గాలిమరలు) కాంక్రీట్ అడవిగా మారుస్తున్నాయి.

జీవావరణ, అటవీ భూమిలో గాలిమరల ఏర్పాటు, ఆ లోయలోని జీవావరణాన్ని దెబ్బతీసి అటవీ భూమి, వాగులు, పచ్చిక బయళ్ళు, జీవనోపాధులు, మరియు ఆ అడవి, ఇంకా ఆ చుట్టుపక్కల గ్రామాలలోని నీటి వ్యవస్థల పతనానికి దారితీసింది. అక్కడ స్థానిక ప్రజల జీవనోపాధి మాత్రమే కాక, సంవత్సరంలో కొంత భాగం ఇక్కడికి వచ్చి గొర్రెలను మేపుకునే సంచార జాతి గొల్లవారి జీవనోపాధికి కూడా నష్టం కలిగింది.

ఈ లోయలోని ప్రశాంతమైన నిశ్శబ్దాన్ని ఇప్పుడు తిరుగుతున్న గాలి మరల రెక్కల మొండి చప్పుడు భంగపరిచింది. ఈ గాలి మరలు తిరగడం మొదలుపెట్టినప్పుడు, ఆగుతున్నప్పుడు అకస్మాత్తుగా వచ్చే భీభత్సమైన చప్పుడు విన్నప్పుడల్లా మనకు ఆ ప్రాంతంలో కనిపిస్తున్న అభివృద్ధి అంతా స్థానిక ప్రజల కష్టాన్నీ, హక్కునూ దోచుకోవడం ద్వారా సాధించింది అన్న చేదు నిజం గుర్తుకురాక మానదు. ఇంతకీ ఈ గాలిమరల ద్వారా ఉత్పన్నం అయిన విద్యుత్‌లో ఒక్క మెగావాట్ శక్తి కూడా వీరికి దక్కదు. ◆

**Farukh Riaz, Anita Sood,**
**Saroj Bhayana and Alpna Sarma**
Paryavaran Jagriti Abhiyan Committee
Society for Promotion of Wastelands Development,
14A Vishnu Digamber Marg, New Delhi 110002.
Email : spwdenvironment2012@gmail.com

ఆంగ్లమూలం :

లీసా ఇండియా, సంపుటి 16, సంచిక 3, సెప్టెంబర్ 2014.



వరి సాగుతో పాటు చేపల పెంపకం

# అమూల్యమైన చిన్న కమతాలు


## రంజన్ కె. పాండా, అజిత్ కుమార్ పాండా


**ఒడిశాలో జలప్రళయంలో సర్వం కోల్పోయిన చిన్న రైతులు తమ కుటుంబాలకు ఆహారభద్రతను, పోషకాహారాన్ని సమకూర్చేందుకు సరికొత్త మార్గాన్ని కనుగొన్నారు. ఆ ప్రయత్నంలో వాతావరణంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా తట్టుకునే ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించారు. కాయగూరల తోటల పెంపకం, వరిసాగుతో పాటు చేపల పెంపకం అక్కడి వ్యవసాయదారులకు అవసరమైన ఆహారాన్ని, పోషక పదార్థాలను, ఆదాయాన్ని కూడా సంపాదించిపెడుతున్నాయి.**

సన్నకారు రైతుల్లో చాలామంది, తాము స్వయంగా ఆకలిబాధతో అలమటిస్తూనే ప్రపంచంలోని అత్యధిక ప్రజానీకానికి అత్యవసరమైన ఆహార పదార్థాలను సమకూరుస్తున్నారు. వాస్తవానికి ఇలా కుటుంబాలు యావత్తూ వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నవాళ్లే. వాళ్లు ఆహారం పండించడంతోపాటు మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు కూడా. వారిని అనేక సమస్యలు నిత్యం పీడిస్తున్నాయి. అలాంటి వాటిలో ముందుగా చెప్పవలసినవి - అదుపు లేని ఉత్పత్తి ఖర్చుల భారం, ఆశించిన దానికన్నా చాలా తక్కువగా లభిస్తున్న దిగుబడులు, పాలకపక్షాల నుంచి నామమాత్రంగా అందుతున్న మద్దతు, నిలకడ లేని వాతావరణం. వీటిని ఎదుర్కొంటూ కూడా వారు నేల తల్లిని నమ్ముకుని వ్యవసాయం చేయడానికి సిద్ధమవుతున్నారు.

ఇక ఒడిశాలోని రైతన్నలు వ్యవసాయ రంగంలో నిలదొక్కుకునేందుకు నిరంతరం అనిశ్చితమైన వాతావరణ పరిస్థితులతో పోరాటం చేయాల్సిందే. నౌపడా జిల్లాలో నిత్యం కరువు రక్కసి భయపెడుతుంది. ఇక కోస్తా ప్రాంతపు జిల్లాలైన కేంద్ర పర వంటి చోట్ల నిరంతరం ముంచెత్తే వరదల ముప్పుతో సతమతమవుతూ ఉంటారు. ఇలాంటి విపరీత వాతావరణపరమైన సవాళ్లను తట్టుకుంటూ కాయగూరల తోటల పెంపకంతోపాటు సమీకృత వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. ఈ నిరంతర కృషీవలురు అనుసరిస్తున్న విధానాలను గురించి ఇప్పుడు

తెలుసుకుందాం. రెండు విభిన్నమైన వాతావరణ సమస్యల మధ్య నలిగిపోతున్నప్పటికీ ఆయా ప్రాంతాలలోని సేద్యగాళ్లు ఏ రకంగా తమ గుండెల నిండుగా విశ్వాసపు బీజాలను దృఢంగా నాటుకున్నారో తెలుసుకుందాం.

## క్షామ పరిస్థితుల్లో కాయగూరల పెంపకం

నౌపడా జిల్లా ఖరియార్ తాలూకా దొహెల్పడ గ్రామానికి చెందిన వనమాలి బెహరా రెండు ఎకరాల పొలం ఆసామి. ఏడాది పొడవునా అర ఎకరా స్థలంలో కాయగూరల పెంపకం చేస్తుంటాడు. పొలంలో తవ్వుకున్న నేల బావి నుంచి లభించే నీటితో పంటలు పండిస్తాడు. బావిలో నుంచి నీటిని తోడేందుకు సంప్రదాయక సాధనం తెండా (మోట బావి) ఉపయోగిస్తాడు. పొలం పనుల్లో కుటుంబ సభ్యులందరూ పాల్గొంటారు. రోజుకు రెండు గంటల పాటు కష్టపడితే వారు తినడానికి మాత్రమే కాక అమ్ముకునేందుకు కూడా వీలుగా సమృద్ధిగా కాయగూరలు పండుతాయి. ''పొలానికి నీరు పెట్టడానికి రోజూ ఓ గంట కష్టపడాలి. మరోగంటపాటు ఇతర పనులు అంటే కలుపు ఏరివేత, మొక్కల మొదళ్ల దగ్గర మట్టి సర్దడానికి వినియోగించాలి.'' అంటారాయన. అలా నిక్కచ్చిగా పనిచేస్తే మా కష్టానికి తగిన ఫలితం అందుతుంది. ఎంత ఎక్కువ కష్టిస్తే అంత ఫలితం అందుతుంది. ఈ మాత్రం సేద్యం చేసే అవకాశం లభించింది. అదే పదివేలు. మేం ఇంత తినగలుగుతున్నాం. సగానికి సగం సరుకును సమీపంలోని మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకుని ఎంతో కొంత ఆదాయం పొందుతున్నాం, అంటున్నది ఆయన భార్య సంయుక్త.

ఇదేవిధంగా వనమాలి అడుగుజాడల్లో మరెంతో మంది ఖచ్చితంగా చెప్పాలంటే 30 మంది కాయగూరల పెంపకం పై జీవితం సాగిస్తున్నారు. వాళ్లంతా తమ కుటుంబాలకు పుష్టికరమైన ఆహారం అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అదనంగా ఆదాయం సంపాదించుకుంటున్నారు. ''ఈ గ్రామం పరిసరాల్లోని గ్రామాలన్నిటికీ ఆదర్శంగా నిలుస్తోంది'' అంటున్నారు అశోక్ పట్నాయక్. ఆయన స్థానికంగా ఇలాంటి రైతన్నలకు తోడ్పాటు అందిస్తున్న రెండు స్వచ్ఛంద సంస్థలలో కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆయన పని చేస్తున్న రెండు సంస్థల పేర్లు కరబ్యా, వికాశ్. సమీపంలోని మరో గ్రామం మోడిసిల్‌లో పరిస్థితి కూడా ఇదే విధంగా గుండెల నిండా ఆత్మవిశ్వాసం నింపుకున్న రైతన్నలతో కళకళలాడుతూ ఉంటుంది.

> కుటుంబ సభ్యులకు పోషక విలువలతో కూడిన ఆహారం సమకూర్చడంతోపాటు సమీకృత వ్యవసాయ విధానాలు రైతన్నల ఆర్థిక స్థితిగతులను కూడా మెరుగుపరచగలిగాయి.



సమృద్ధిగా కాసిన వంకాయలు



తన పెరటి తోటలో వనమాలి

ఈ గ్రామాలలో వర్షాధార వరి సాగు చాలాకాలంగా ఆటుపోట్ల మధ్య సాగేది. గత్యంతరం లేని సందర్భాలలో వారు ఇతర ప్రాంతాలకు బతుకు తెరువు వెతుక్కుంటూ వలసపోయేవారు. కరువుకాటకాలు తీవ్రంగా ఉండడం, పంటలు వరుసగా దెబ్బతినడం వారికి మరో మార్గం లేకుండా మార్చివేసేవి. ఇది ఒకప్పుడు ఏటా సర్వసాధారణంగా ఉండేది. అయితే గ్రామీణులు ఆ సమస్యను విజయవంతంగా పరిష్కరించుకోగలిగారు. అందుకు కాయగూరల పెంపకం రాచబాట వేసింది. ఈ రెండు స్వచ్ఛంద సంస్థలు గ్రామీణులకు ప్రభుత్వ పథకాలను చేరువ చేయడంలో తమ వంతు సాయం అందించాయి.

అదే జిల్లాలోని కుసుమకుంట గ్రామంలో చత్తర్ మాఝీ, ఉజ్వల్ మాఝీల అనుభవం అందరూ తెలుసుకోవడం అవసరం. ఇద్దరూ సన్నకారు రైతులే. కూలీ పనులు చేసుకుని బతుకుబండి లాగుతూ ఉండేవారు. అయితే వారికి కొద్దిపాటి పొలం కూడా ఉంది. వర్షాధారితమైన ఆ కొద్దిపాటి పొలం వాళ్ల కుటుంబాలకు అవసరమైన కనీస అవసరాలు కూడా తీర్చలేకపోయేవి. అయితే ఏడాది క్రితం వారి జీవితాల్లో సరికొత్త ఆశారేఖ చోటుచేసుకుంది. ఆ సమయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (MGNREGS) లబ్దిదారులుగా వాళ్లను వారు నివసించే పల్లె సభ ఎంపిక చేసుకుంది. ఈ పథకం కింద వ్యవసాయ క్షేత్రాల్లో బావులు లేక చెరువులు తవ్వడానికి ఆస్కారం ఉంది. ఆ రకంగా

చెరువుల తవ్వకం పథకం (MO Pokhari Yojana) కింద వాళ్లకి ఒక్కొక్కరికి రూ.20000 ఆర్థిక సహాయం లభించింది. వాటితో తమ పొలాల్లో నీటి సదుపాయం ఏర్పాటు చేసుకున్నారు.

ఆ రకంగా లభించిన ఆర్థిక సహాయంతో అవసరమైన ముడి సరుకులు, ఇంకా ఇతర అనుబంధ ఖర్చులను తీసేసిన తరువాత చత్తర్‌కు రూ.15వేలు, ఉజ్వల్‌కు రూ.14వేలు చేతికి వచ్చాయి. చత్తర్ తన 70 డెసిమల్స్ పొలంలోనుంచి 4 డెసిమల్స్ విస్తీర్ణంలో బావిని తవ్వించాడు. పొలం చుట్టూ కంచె నిర్మించాడు. కాయగూరలు పండించాలని నిర్ణయించాడు. ఉజ్వల్ తన 45 డెసిమల్స్ నేలలో టొమాటో పండించేందుకు కేటాయించాడు. మిగిలిన దానిలోను, చెరువు గట్టున బెండకాయలు, సన్‌ఫ్లవర్, ఇంకా ఇతర కాయగూరలను పండించేందుకు సిద్ధమయ్యాడు. ''ఏడాది పొడవునా కాయగూరలు మేం కడుపు నిండా తినగలుగుతున్నాం. మిగిలిన వాటిని విక్రయిస్తున్నాం. ఆ రకంగా ఈ సంవత్సరం రూ.15000 సంపాదించాం. నేను ఇప్పుడు పొట్ట చేతపట్టుకుని పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లవలసిన అవసరం లేదు.'' అంటూ ఎంతో ఆనందంగా మరెంతో ఉత్సాహంగా చత్తర్ చెబుతున్నాడు.

ఉజ్వల్ కూడా ఇప్పుడు 50 డెసిమల్స్ భూమిలో ఉల్లి సాగుచేస్తున్నాడు. పొలం గట్లపై ఇతడు అర్హర్ సాగు ప్రారంభించాడు. ఈ ఏడాది ఉజ్వల్ రూ.14000 సంపాదించినట్టు చెబుతున్నాడు. వలస బాధ నుంచి బయటపడ్డాడు. వీళ్లిద్దరూ కూడా తమ కుటుంబ సభ్యుల శ్రమ ఆధారంగానే పొలంలో బావులను తవ్వుకున్నారు. అంటే ఆ విధంగా ఉపాధి హామీ పథకం కింద సంపాదించిన కూలీ సొమ్ములను అదనంగా పొందారు. వారి గ్రామంలోనే మరో ఎనిమిది మంది కూడా ఇదే మార్గంలో ముందుకు వెళ్లారు. ఇప్పుడు ఈ గ్రామం ఇతర గ్రామాల వారికి ఆదర్శంగా మారింది. అశోక్ పట్నాయక్ మాటల్లో చెప్పాలంటే - పెరటి తోటల పెంపకం తరతరాలుగా వస్తున్నదే. గతంలో ఇళ్ల ముందూ వెనకా ఉన్న స్థలంలో ఇలా కాయగూరలు పండిచడం ఒక అలవాటుగా ఉండేది. ఆ విధంగా కుటుంబ సభ్యులకు పోషక విలువలున్న ఆహారం లభించేది. కాలక్రమంలో ఈ అలవాటు మరుగున పడింది. అందుకు ప్రధానమైన కారణంగా కూలీలు దొరకడంలో ఇబ్బంది ఏర్పడడమే అని చెప్పవచ్చు. ఇప్పుడు స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు, ప్రేరణల ఫలితంగా ప్రతీ గ్రామం లోను కనీసం 20-30 శాతం కుటుంబాలు పెరటి తోటల్లో కాయగూరల పెంపకం చేపడుతున్నాయి. వాళ్లలో చాలామంది మిగులు దిగుబడిని మార్కెట్‌కు చేర్చి అదనపు ఆదాయం సంపాదించగలుగుతున్నారు.

## సమీకృత వరిసాగు, చేపల పెంపకం

కేంద్రపర జిల్లా రాజ్‌నగర్ తాలూకాలోని పద్మనవ పట్నం అనే గ్రామంలో నిత్యం వరదల తాకిడి వరి సాగుచేసే రైతుల జీవితాలను అల్లకల్లోలం చేసేవి. కానీ, ఇప్పుడు, అనేక దేశాల సమష్టి కలయికతో చేపట్టిన కార్యక్రమం 'పరివర్తన్' వాళ్ల జీవితాలకి కొండంత అండగా నిలిచింది. అందుకు కన్సర్న్ వరల్డ్ వైడ్, యూరోపియన్ యూనియన్ మద్దతుగా నిలిచాయి. ఈ కార్యక్రమం అమలు చేయడంలో స్థానికంగా ఉన్న మరో స్వచ్ఛంద సంస్థ ఆర్సీడీసీ సహకారం అందించింది. కాంచన సామల్ వంటి సన్నకారు రైతులు వీరి ప్రోత్సాహంతో చేపల పెంపకం చేపట్టారు. అంతేకాకుండా తమకు ఉన్న చిన్న కమతాల్లో కాయగూరల పెంపకం కూడా ప్రారంభించారు.

కాంచనకు 2000 చేప పిల్లలను అందించారు. అవసరమైన చేపపిల్లల ఆహారం కూడా అందించారు. ఇంకా కాయగూరల విత్తనాలు, మొక్కలను కూడా అందించారు. జూన్ 2013లో ఆమె తనకు ఉన్న 50 డెసిమల్ భూమిలో సొంతంగా సమీకృత సాగు ప్రారంభించింది. దానిని ఒక భాగం పొలంగానూ, మరో భాగాన్ని చేపల చెరువుగాను మార్చివేసింది. అందులో వరిసాగు చేయవచ్చు. చేపలను పెంచవచ్చు. నీరు లోపలికి రావడానికి, మురికినీరు లేదా అదనపు నీరు బయటకు పోవడానికి వీలుగా సదుపాయాలు ఏర్పాటు చేసింది. చేపలు మాత్రం గట్లు దాటకుండా జాగ్రత్తలు తీసుకుంది. పొలం గట్లను కాయగూరలు పండించేందుకు ఉపయోగించింది. పొలానికి, తోటలకు సేంద్రీయ ఎరువులనే వినియోగించింది.

కాంచన ఇప్పుడు సగర్వంగా తల ఎత్తుకు తిరుగుతున్న రైతుబిడ్డ. తనకున్న చిన్న కమతంలో 200 శాతం ఆదాయం సంపాదించగలుగుతోంది. ఏడాది వ్యవధిలో ''వరిసాగు ద్వారా రూ.5000 వస్తోంది. ఈ ఏడాది చేపల ద్వారా రూ.8000 వచ్చింది. కాయగూరలను అమ్మడం ద్వారా మరో రూ.3000 సంపాదించాను.'' అని చెప్పింది కాంచన. ''ఇప్పుడు మేము మా కుటుంబం కోసం కాయగూరలు, చేపలు కొనవలసిన అవసరం లేదు.'' అని సగర్వంగా చెప్పిందామె. పిల్లలకు బైసికిల్స్ కొనిచ్చింది. వారి చదువుకు అయ్యే ఖర్చులను భరించగలుగుతోంది. ఇంకా మరెన్నో రకాలుగా కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటోంది. స్థానిక స్వచ్ఛంద సంస్థకు చెందిన జనమేజయ ఈ విధంగా తెలియజేస్తున్నారు. ''ఈ కార్యక్రమం ద్వారా చేయూత అందుకున్న సన్నకారు రైతులందరూ ఇలాంటి సత్ఫలితాలనే సాధించారు. కుటుంబానికి పోషకాలు అందించడమే కాక, సమీకృత వ్యవసాయం వారి ఆర్థిక స్థితిని మెరుగుపరిచింది.''

కన్సర్న్ వరల్డ్ వైడ్ సంస్థలో సాంకేతిక సలహాదారుగా (వాతావరణ మార్పులపై) పనిచేస్తున్న సరోజ్‌దాస్ ఈ రకమైన ప్రయత్నాలు ఆహ్వానించదగినవన్నారు. ''తుపాను, వరదల ముప్పు అధికంగా ఉండే కోస్తా ప్రాంతంలోని జగత్‌సింగ్‌పూర్, కేంద్రపరా



*తాను పెంచుతున్న కూరగాయల తోటలో కాంచన*

జిల్లాల సన్నకారు రైతులు ఈ విధానాలను విజయవంతంగా ఉపయోగించుకున్నారు. ఆ రకంగా విపత్తు సమయాలలో తమ కుటుంబాలకు పోషకాహారం, ఆహారం, ఆదాయం సమకూర్చుకోగలిగారు. ఈ పద్ధతులు మన భారతదేశపు తీర ప్రాంతాలలోనే కాదు, బంగ్లాదేశ్‌లో కూడా ఆచరణీయమైనవే. వరి-చేపల పెంపకం కలిపి చేపట్టడం వల్ల వరిసాగు కారణంగా పర్యావరణానికి ఎదురయ్యే కాలుష్యాన్ని కూడా నియంత్రించవచ్చు'' అని దాస్ తెలిపారు.

ఈ రైతన్నలందరూ విపత్తులను, పేదరికాన్ని జయించారు. కుటుంబానికి కడుపు నిండా తిండి గింజలు అందించారు. పోషక విలువలతో కూడిన ఆహారం అందించారు. అదనంగా ఆదాయం సంపాదించుకోగలిగారు. ధన సంపాదనలో వారు పేదలే కావచ్చు. కానీ, తమకున్న కొద్దిపాటి భూమిని సద్వినియోగం చేసుకుని గొప్ప ఫలితాలను అందుకోగలిగారు. చిన్న కమతాలు అవి ఎంత చిన్నవే అయినా వాతావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో తమ వంతు పాత్ర నిర్వహించగలవనే సత్యం మనం గుర్తించాలి. ◆

**RANJAN K PANDA**
BASERA, R/3-A-4, J.M.Colony, Budharaja,
Sambalpur 768 004
Odisha, India.
Email : ranjampanda@gmail.com

**AJIT KUMAR PANDA**
Co-Convenor
Water Initiatives, Odisha

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 16, సంచిక 4, డిశంబర్ 2014.